# ధాటీ పంచకము-శ్రీమాన్ ముదలి ఆండాన్ వంశ వివరములు

Meaning & interpretation in Telugu

By **Srimaan Ramacharyulu**, Delhi

శ్రీమతే రామానుజాయ నమః

కొంతమంది మిత్రులు, సభ్యులు ధాటీ పంచకము వివరణని వ్రాయుమని నిర్దేశించేరు. ఆచార్యులు, పెద్దలు అయిన సభ్యుల అనుమతితో ఆప్రయత్నాన్ని ప్రారంభిద్దామని అనుకుంటున్నాను.

ధాటీ అంటే తెలుగులో దాడి అన్నమాట. (దారి అని కూడా వ్యవహారముందనుకోండి). ఏమిటీ దాడి, ఎవరిపైన, ఏ సందర్భములో మొదలైన వివరాలు తెలియాలంటే దానికి సంబంధించిన భగవద్రామానుజుల చరిత్ర, కృతికర్త అయిన ముదలి ఆండాన్(దాశరథి) గారి చరిత్ర కొంచెం స్మరించుకోవాలి. దానికి ముందు ముదలి ఆండాన్ గారి తనియన్, తదర్థము చూద్దాము.

### పాదుకే యతిరాజస్య కథయంతి యదాఖ్యయా

### తస్య దాశరథేః పాదౌ శిరసా ధారయామ్యహమ్

యతిరాజుల (భగవద్రామానుజుల యొక్క ) పాదుకలుగా ఎవరిని చెప్పెదమో ఆ దాశరథి పద ద్వంద్వము శిరస్సున నేను ధరించెదను.

### యచ్చక్రే భక్త నగరే ధాటీ పంచకముత్తమమ్

### రామానుజార్య సచ్ఛాత్రమ్ వందే దాశరథిమ్ గురుమ్

భక్తనగరము నందు (తొండనూరు) ఏ ఉత్తమమైన ధాటీ పంచకము(అనియెడు స్తోత్రమును) రచించిరో ఆ రామానుజార్యుల మంచి శిష్యులయిన, గొప్పవారయిన దాశరథికి నమస్కరించుచున్నాను.

పై రెండు తనయల వలన దాశరథి అనువారు భగవద్రామానుజుల పాదుకలుగా కొలువబడుదురని, వారు తొండనూరునందు ధాటీ పంచకమును రచించిరని తెలియుచున్నది.

శ్రీమాన్ దాశరథి నే ముదలి ఆండాన్ అని పిలిచెదరు. వీరు భగవద్రామానుజుల సహోదరి పుత్రులు. అనగా రామానుజుల మేనల్లుడు. వీరి తండ్రిగా పేరు అనంత నారాయణ దీక్షితులు. వీరు ఆపస్తంభసూత్రులు, యజుశ్శాఖాధ్యాయి, శ్రోత్రియులు. వీరి తల్లి నాచ్చియారమ్మ. వీరికి కొంత కాలము సంతానము కలుగ లేదు. సంతానమునకై ఆ దంపతులు తిరుమల యాత్ర గావించి, శ్రీవేంకటేశ్వరుని సంతానమునకై ప్రార్థించగా బయలుదేరిరి. ప్రయాణము మధ్యలో తిరునిన్రవూరను క్షేత్రమున ఏరి కాత్త రామర్ సన్నిధి యందు రాత్రి బస చేసిరి. శ్రీరాముడు శ్రీమాన్అనంత నారాయణ దీక్షితుల గృహారాధనా దైవము. అంత శ్రీరాముడు స్వప్నమునందు ప్రత్యక్షమై సంతానమునకై తిరుమల ప్రయాణమవసరము లేదనియు, ఆదిశేషుడు శ్రీపెరుంబూదూరు నందు అవతరించిరనియు, శ్రీరామావతారమున లక్ష్మణుల శేషోపచారములను అనుభవించి ఋణగ్రస్తుడయిన తాను ఆ ఋణము చెల్లించుటకనినట్లు వారలకు పుత్రునిగా నవతరించెదనని తెలిపెను.

అట్లే వారలకు పచ్చై వారణ పురమున ( పూనమల్లి వద్ద) ప్రభవ సంవత్సరమున, చిత్ర మాసమున, పునర్వసు నక్షత్రమున వాధూల గోత్రమున క్రీ.శ. 1027 సంవత్సరమున పండంటి పుత్రుడు జన్మించెను. ఆ పిల్లవానికి శ్రీరాముని పేరుగా దాశరథి యని నామకరణమొనర్చిరి.

మేషాపునర్వసుదినే దాశరథి అంశ సంభవమ్

యతీంద్ర పాదుకాపిక్యమ్ వందే దాశరథిమ్ గురుమ్

(చిత్రా/ మేష మాసమున పునర్వసు నక్షత్రమున జన్మించి రామాంశమున యతిరాజ పాదుక యని పిలువబడెడు మా గురువులైన దాశరథికి నమస్కరించుచున్నాను .

వీరికే వాధూలదేశికులనియు, వైష్ణవ శిరోభూషణమనియు, ముదలి ఆండాన్ అనియు రామానుజ త్రిదండమనియు, శ్రీ వైష్ణవ దాసరనియు నామాంతరములు, బిరుదనామములును కలిగినవి.

శ్రీమాన్ దాశరథి భగవద్రామానుజుల నాశ్రయించిన పిదప పరమపదమున శ్రీమన్నారాయణుని సన్నిధిలో సేనై ముదలియార్ (విష్వక్సేనులు) వలె సమస్త నిర్వాహక సామర్థ్యము కలిగి భగవద్రామానుజుల తలలో నాలుక వలె ప్రవర్తించుటచే వీరికి ముదలి ఆండాన్ అని పేరు. ఆండాన్ అనగా దక్షులు, రక్షకులు అని అర్థము. అటులనే వీరు వాధూల కులమునకు దిశానిర్దేశము చేసిన వాధూల వంశాగ్రణి అగుటచే వాధూల దేశికులని అందురు. వైష్ణవ సన్యాసులకు ఎల్లప్పుడు చేతిలో త్రిదండముండును. (అద్వైత సన్యాసులకు ఏక దండమే కదా!). ఈ త్రిదండము భగవానుని ప్రతీక. సంతతము కూడి యుండి కాపాడు చుండును. అంతియ గాక నది విశిష్టాద్వైత సిద్ధాంతము ననుసరించి మూడు తత్త్వములను (చిత్, అచిత్, ఈశ్వర తత్త్వములు) తెలుపును. అట్లే ఆ త్రిదండధారి త్రిగుణాతీతుడని (సత్వ, రజ, స్తమో గుణములకు అతీతుడని) తెలియ జేయును. శ్రీమాన్ దాశరథిని భగవద్రామానుజులే స్వయముగా తన త్రిదండ ప్రాయులుగా పరిగణించి తన ఆచార్యులయిన గోష్ఠీపూర్ణుల వద్దకు తోడ్కొని వెళ్ళిరి. ( ఆ వివరాలు తరువాత తెలిసికొందాము. ). శ్రీమాన్ దాశరథి సాక్షాత్తు పెరుమాళ్ళ అంశయే గదా! ఆ కారణంగా వీరికి రామానుజ త్రిదండమని నామాంతరము. వైష్ణవుల యందు వీరికి గల భక్తి, కైంకర్య భావము ననుసరించి వీరిని వీరి శిష్యులు వైష్ణవ దాసరని పిలిచెడువారట. మనము వైష్ణవాలయముల సందర్శించినపుడు శఠారిని శిరమున గ్రహించెదము. ఏల యన స్వామి నమ్మాళ్వార్ భగవత్పాదుకా సమానులు. అట్లే శఠగోప పాదుకా సమానులు భగవద్రామానుజులు. భగవద్రామానుజ పాదుకా సమానులు స్వామి దాశరథి. అందుచే వీరికి యతిరాజ పాదుక యని పేరు. అందులకే వీరి తనియన్ (ఒక ప్రత్యేక మైన ఆచార్యుల ప్రసిద్ధిని కీర్తించు ఛందోబద్ధమైన శ్లోకమునకు తనియన్ అని పేరు). యందు పాదుకే యతిరాజస్య అని పలికెదము.

అనంత నారాయణ దీక్షితులు తన కుమారునకు ఉపనయనాది సంస్కారములను గావించి ద్రావిడ ప్రబంధములను, శ్రుతి, పురాణాదులను నేర్పించి వివాహము చేసిరి. అప్పటికి భగవద్రామానుజులు సన్యాసాశ్రమ స్వీకారము చేసి విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకులుగా యున్నారు. శ్రీమాన్ దాశరథి కాంచీపురమునకు వేంచేసిన భగవద్రామానుజుల దర్శించి వారి సంతత సాన్నిధ్యాభిలాషులై భగవద్రామానుజులను ప్రార్థించేరు. భగవద్రామానుజులు వారికి పంచసంస్కారములను గావించి ఆ నాటి నుండి శ్రీమాన్ దాశరథిని ముదలి ఆండాన్ అను పేరుతో తన నిత్య కైంకర్యములకు నియమించిరి. భగవద్రామానుజులకు అత్యంత ప్రీతి పాత్రులు, నిత్య సన్నిహితులు ముదలి ఆండాన్ మఱియు కూరత్తాళ్వాన్. అటుపిమ్మట భగవద్రామానుజులు కాంచీపురమును వీడి శ్రీరంగమునకేగు నపుడు శ్రీమాన్ ముదలి ఆండాన్ స్వామి సతీ సమేతముగా శ్రీరంగమునకు వేంచేసిరి. భగవద్రామానుజులు చరమ శ్లోకార్థ రహస్యమును గ్రహించుటకు గోష్ఠీపూర్ణుల వద్దకు 17 సార్లు విసుగు చెందక వెళ్ళి ప్రార్థించగా చివరకు గోష్ఠీపూర్ణులు రామానుజులను ఈ రహస్యము పరమ గుహ్యమైనందున కేవలము నీవు

మాత్రము రావలయునని ఆదేశించిరి. భగవద్రామానుజులు నేను దండ, పవిత్రములతో మాత్రము వచ్చెదనని ముదలి ఆండాన్, కూరత్తాళ్వాన్ లతో గోష్ఠీపూర్ణుల వద్దకు వచ్చిరి. నిన్నొక్కడనే రమ్మనిన ఆండాన్, ఆళ్వాన్ లను ఏల తోడ్కొని వచ్చితివని గోష్ఠీపూర్ణులు ప్రశ్నించగా నాకు దండము ఆండాన్, పవిత్రము కూరత్తాళ్వాన్ కనుక నేను దండ పవిత్రములతో మాత్రమే వచ్చితినని పలికిరి. గోష్ఠీపూర్ణుల మంత్రోపదేశమైన పిదప కూరేశులు మాసోపవాస దీక్ష బూని భగవద్రామానుజుల వద్ద మంత్రోపదేశమును పొందిరి. ఆ విషయము తెలిసిన ముదలి ఆండాన్ స్వామి భగవద్రామానుజులను ప్రార్థించగా వారు గోష్ఠీపూర్ణులను దర్శించి వారికి రామానుజులు నాకింకా మంత్రోపదేశమును చేయలేదని విన్నవించుకొన మని చెప్పిరి. ఆండాన్ ఈ విషయము గోష్ఠీపూర్ణులకు విన్నవించగా, గోష్ఠీపూర్ణులు "ఈ లోకమున విద్యామదము, ధన మదము, కులమదము అను మూడు మదాలు ఉన్నవి. నీవు ఈ మూడు మదములను పరిత్యజించి రామానుజుని ప్రార్థించుము. తప్పక కరుణింపగలడు" అని పలికెను. ఆండాన్ తిరిగి రామానుజులను చేరి విషయము తెలుపగా రామానుజులు" ఆ మూడు మదములను పూర్తిగా విడచి పెట్టితివా" అని ప్రశ్నించెను. ఆండాన్ విడచిపెట్టితినని సమాధానమీయగా తనకా నమ్మకము కలిగిన తరువాతనే మంత్రోపదేశము చేయుదునని రామానుజులు పలికేరు. అటుపిమ్మట రామానుజుల ఆచార్యులయిన పెరియనంబి గారి కుమార్తె అత్తుళాయమ్మకు అత్తవారింట సహాయమునకు ఎవ్వరూ లేకపోవడంవలన ఆమె అత్తగారిచే నీసడింపులు భరించలేక తన తండ్రితో చెప్పికొనినది. ఆయన నీవు రామానుజులకు విన్న వించుకొనుము. ఆయనే ఏదయినా ఉపాయము చెప్పును అని పలికెను. అంతట రామానుజులు ముదలి ఆండాన్ ను అత్తుళాయమ్మ గారింటియందు దాస్యమునకు నియోగించిరి. పాత్ర శుద్ధి, ఇల్లు తుడవడం నుండి సమస్త పనులు ఆండాన్ శ్రమ అనక చేయుచుండెడువారు. వారింటియందు జరుగు పండిత చర్చల యందు ఒకనాడు ఒక పండితుడు అపార్థములు పలుకు చుండగా వంటపనిలోనున్న ఆండాన్ ఆ పండితుని సరిచేసెను. అప్పుడు అందరూ ఆండాన్ పాండిత్యము గ్రహించి అట్టి భాగవతోత్తమునిచే పనులు చేయించుకున్నందుకు సిగ్గిలి, ఆండాన్ ను మన్నించమని వేడుకొనిరి. ఆండాన్ తాను ఆచార్యాదేశముతో అచట నుంటినని, ఆచార్యుల అనుజ్ఞ లేక వదిలి వెళ్ళలేనని పలుకగా, వారు భగవద్రామానుజుల వద్దకు వచ్చి ప్రార్థించగా భగవద్రామానుజులు ఆండాన్ ను పిలచి, ఆండాన్ ప్రవర్తనతో తాను సంతృప్తి పొందినట్లు తెలిపి మంత్రోపదేశము చేసిరి. యతిరాజుల మంత్రోపదేశముతో ముదలి ఆండాన్ కృతార్థులయ్యారు.

భగవద్రామానుజులు అనుదినము కావేరీ నదిలో స్నానము చేయుటకు పోవునపుడు సహాయము కొఱకు శ్రీమాన్ ముదలి ఆండాన్ భుజముపై చేతినుంచి పోవుచుండెడివారట. స్నానానంతరము అట్లే పిళ్ళై ఉరంగ విల్లి దాసర్ భుజముపై చేతులనుంచి తిరిగి వచ్చెడువారట. ఇది శ్రీమాన్ ముదలి ఆండాన్కు

చిత్రముగా తోచినను ఎప్పుడును ఆచార్యులను ప్రశ్నించలేదు. ఆచార్యులేమి చేసినను అది అంతయు మంచికే నను భావనము గలవారు వారి శిష్యులు.

కాలక్రమేణ రామానుజులు ముదలి ఆండాన్ కు శ్రీరంగనాథుల ఆరాధనా వ్యవహారములను, ఉపచార కైంకర్యములను ముదలి ఆండాన్ కు అప్పగించిరి. పెరుమాళ్ళకు ఇష్టమైనదని ఒకసారి పెరుగన్నము, నేరేడు పళ్ళు ఆరగింపునకు ముదలి ఆండాన్ వినియోగము చేసిరి. భగవద్రామానుజులు తరువాత రంగనాథుని చూడవచ్చినపుడు పెరుమాళ్ళ ముఖమండలము కళ తప్పినట్లు తోచి ఆండాన్ ను ఈ రోజు పెరుమాళ్ళకు ఏమి ఆరగింపు చేసితివని ప్రశ్నించగా ఆండాన్ పెరుగన్నమును నేరేడుపళ్ళతో ప్రసాదమునకు వినియోగంచినట్లు చెప్పిరి. అంతట రామానుజులు అచ్చట ఆస్థాన వైద్యులయిన గరుడ వాహన పండితులను పిలిపించి ఔషధ కషాయము చేయించి పెరుమాళ్ళకు వినియోగము చేయగ పెరుమాళ్ళ ముఖము ఎప్పటివలె కాంతివంతమైనది. ఆనాటి నుండి ఆండాన్ మరింత జాగరూకతతో పెరుమాళ్ళ కైంకర్యములు చేయు చుండెడి వారు. వారికి అర్చామూర్తి సాక్షాత్ శ్రీమన్నారాయణుడే. తమ ఇంట ఒక చిన్న పిల్లవానిని చూచుకొనునట్లు అత్యంత శ్రద్ధ వహించి చూచుకొను చుండెడువారు.

శ్రీమాన్ యామున యతీంద్రులకు తానిచ్చిన మాట ప్రకారము రామానుజులకు బాదరాయణకృత బ్రహ్మ సూత్రములకు సరి అయిన భాష్యము విశిష్టాద్వైత సిద్ధాంతము ననుసరించి వ్రాయవలసి యున్నది. అందులకు కావలసిన భగవత్ బోధాయన కృత వృత్తి గ్రంథము కాశ్మీర దేశమునందు మాత్రము లభ్యమగునని రామానుజులు కాశ్మీరయాత్రకు బయలుదేరిరి. తనకు తోడుగా కూరేశులను కొని పోవుచూ, ఆండాన్ ను శ్రీరంగమునందు కార్య నిర్వాహకమునకు, రంగనాథ కైంకర్యాది వ్యాపారములకు నియోగించిరి. శ్రీమాన్ ఆండాన్ గొప్ప కార్య నిర్వహణా సామర్థ్యము కలవారు. గొప్ప శ్రద్ధా సక్తులు సంపూర్ణ అర్పిత భావము గలవారు. మిక్కిలి శ్రద్ధతో కోవెల కైంకర్యములు నిర్వర్తించు చుండెడి వారు.

భగవద్రామానుజులు సుమారు 25 సంవత్సరముల తరువాత తిరిగి శ్రీరంగము వచ్చినప్పుడు శ్రీమాన్ ఆండాన్ శ్రీరంగ క్షేత్ర నిర్వాహకము చూచి చాలా సంతోషించేరు. శ్రీమాన్ ఆండాన్ కోవెల కైంకర్యములు అత్యంత వైభవముగా చేయించుటయేగాక కోవెల సంపదలు ద్విగుణీకృతము గావించిరి.

ఈ సంపద్విభవముల జూచి ఈర్ష్య పడు దుష్టులు ఆ కాలముననూ లేకపోలేదు. ఆ దేశమును పాలించు కుళోత్తుంగ చోళుడను రాజు రామానుజుల వశపరచుకొనిన ఈ వైష్ణవుల ఆట కట్టునని తలంచి రామానుజులను దండించ వలెనని రామానుజులచే "శివాత్పరతరమ్ నాస్తి" అని వ్రాయించి అవమానించ వలెనని సంకల్పించి వారలను తన సభకు పిలువ కబురంపెను. అది ముందుగానే తెలిసిన రామానుజుల శిష్యులు రామానుజులను, ఆయనకు తోడుగా ముదలి ఆండాన్ ను మరి కొంతమంది శిష్యులను శ్రీరంగము విడచి వెళ్ళునట్లు రామానుజుల కిష్టము లేకున్నను ఏర్పాటు చేసిరి. రామానుజుల

వేషము నందు కూరేశులు, వారితో వృద్ధులై యున్న పెరియనంబి గారు రాజాస్థానమునకు పోయి చోళరాజును ధిక్కరించిరి. కూరేశులు "శివాత్పరతరమ్ నాస్తి ద్రోణమస్తి తతః పరమ్" అని వ్రాయగా కోపగించిన రాజు వారలకు వారి కళ్ళు పీకివేయ నాజ్ఞాపించెను. కూరేశులు తనకు తానే తన నేత్రములను పెరికి వేసికొనిరి. అంధులయిన పెరియనంబి గారు బాధను భరించలేక పరమ పదించిరి. ఆహా! క్రూరాత్ములగు రాజులు రాజ్యము చేసిన ఎట్టి ఇక్కట్లు మంచివారికి దాపురించునో గదా!

భగవద్రామానుజులు కాషాయ వస్త్రములు, దండ పవిత్రములు వీడి శ్వేత వస్త్ర ధారులై బయల్వెడలి కరణాతిగః యందలి తొండనూరు సమీపమును చేరిరి. శ్రీమాన్ ఆండాన్ ఆయనతో యుండి సంరక్షణ చేసుకొను చుండెడి వారు. ఆ ప్రాంతమున జనులు అజ్ఞానులై కొంతమంది శైవులుగా, మరి కొంతమంది జైనులుగా యుండెడివారు. అంతట రామానుజులు వారినందరను ఉద్ధరించ దలంచి ముదలి ఆండాన్ ను పిలచి ఆ ప్రాంతమున నున్న ఒక తటాకమునందు ఆండాన్ తన పాదములనుంచి తిరిగి రమ్మని చెప్పిరి. ఆయా గ్రామ ప్రజలు ఆ తటాకమునుండియే మంచి నీరు త్రాగుటకు వాడండి వారు. స్వామి ముదలి ఆండాన్ తన పాదములను ఆ తటాకమున నుంచుటచే ఆ తటాకమునందలి జల మంతయు పరమ పవిత్రమైన భాగవతశ్రీ పాద తీర్థమాయెను. దానిని సేవించిన ఆ గ్రామ ప్రజలు పరమ వైష్ణవులై సుజ్ఞానము బడసిన వారై రామానుజ శిష్య వర్గమున చేరిరి. ఆహా! భాగవత శ్రీపాద తీర్థము మహిమ ఏమని వర్ణింపగలము ? ఆ తటాకమునే కర్ణాటక యందలి సాలిగ్రామ తీర్థమని వ్యవహరింతుము. అచట ముదలి ఆండాన్ స్వామి శ్రీపాద తీర్థమునకు నిత్య తిరువారాధన జరుగు చుండును.

రామానుజుల గొప్పదనము తెలిసికొనిన ఆ దేశపు రాజు రామానుజులను పిలిపించుకొని తన కుమార్తెకు బ్రహ్మ రాక్షసి ఆవహించెనని దానిని వదలించి తమను ధ్ధరించమని ప్రార్థించెను. రామానుజులు తన శ్రీ పాద తీర్థము తో రాకుమార్తె రుగ్మతను నయము చేయగా అంతకు మున్న జైన మతస్థుడైన రాజు వైష్ణవుడై రామానుజుల శిష్యుడై విష్ణు వర్ధనుడను పేరుతో ప్రసిద్ధి పొందెను. రామానుజులు సేవించిన నృసింహ స్వామి ఆలయము, బ్రహ్మరాక్షసిని పారద్రోలుటకుపయోగించిన నారసింహ దండము, శేషరూపుడైన రామానుజుల అర్చామూర్తి, బుట్ట మొదలైన వారి పరికరాలు ఈ సంఘటనను ఉట్టంకించు శిలాశాసనము తొండనూరు నరసింహ క్షేత్రమున ఈ నాటికిని చూడవచ్చును.

రామానుజులు తమ రాజునకు వైష్ణవత్వము నీయ సహించలేని అచ్చటి జైన మత గురువులు రామానుజులను తమతో వాదమునకు ఆహ్వానించిరి. 12,000 జైన మతగురువులతో భగవద్రామానుజులు ఒక్కరూ ఆనాడు ఖర దూషణాదులతో శ్రీరామ చంద్రుని వలె వాగ్యుద్ధము గావించి జయించి విశిష్టాద్వైత సిద్ధాంతమును కర్ణాటక దేశమున స్థాపించిరి. తాము ఒక్కరూ 12,000 మంది జైన

గురువులతో వాగ్యుద్ధము చేయుటకు అనుకూలముగా ఒక తెర తమకు జైన గురువులకు మధ్య కట్టించిరి. తాము సహస్ర ముఖులయిన ఆది శేషుల రూపము దాల్చి అంతమంది జైనగురువుల ప్రశ్నలకు ఏక కాలమున సమాధానమిచ్చుచు తమ వాదమును అందరకూ ఏకకాలమున సిద్ధాంతీకరించుచూ అందరునూ అచ్చెరువందునట్లు చూపిన రామానుజుల విశేష ప్రతిభకు జైన గురువులు రామానుజులకు దాసోహమనిరి.

ఇవ్విధముగా భగవద్రామానుజులు బ్రహ్మ సూత్రములకు వివరించుచూ శ్రీభాష్య రచన గావించిన పిదప ఉత్తర దక్షిణ భారతావని మొత్తమంతయు పర్యటించి ఆ కాలమున నున్న శైవ, శాక్తేయ, గాణాపత్య, సౌరాది మతములను, న్యాయ, వైశేషిక, పూర్వ మీమాంస, అద్వైతాది దర్శనములను ఇంతకు ముందే నిరసించి విశిష్టాద్వైత దర్శన స్థాపన చేసిననూ, కర్ణాటక దేశమునందు మిగిలి యున్న వేద బాహ్యులయిన జైనులను కూడ జయించుటతో విశిష్టాద్వైత దర్శనము సర్వ జనోద్ధరణకు కారకమైనది.

భగవద్రామానుజులు సహస్రముఖులై జైనులను జయించిన స్థలము తొండనూరునందు మనము ఈనాటికిని చూడగలము.

భగవద్రామానుజులు ఆ ప్రాంతమున నున్న బౌద్ధ, జైన మతస్థులనందరను ఉద్ధరించ బూని ముదలి ఆండాన్ ను నిర్దేశించిరి. ముదలి ఆండాన్ స్వామి కర్ణాటక రాజ్యమెల్ల పర్యటించి బౌద్ధ జైన మతస్థుల నెల్ల నుద్ధరించి విశిష్టాద్వైత దర్శన స్థాపనము గావించి అందరకూ శ్రీమన్నారాయణుడే పరతత్త్వమనియు, ప్రకృతి, జీవములు ఆయనకు అవిభిన్న అపృథక్విశిష్టములనియు సిద్ధాంతీకరించి పంచ నారాయణ ఆలయములు నిర్మింప జేసిరి. ఇవియే తలకాడు నందలి కీర్తి నారాయణ ఆలయము, తొండనూరు నందలి నంబి నారాయణ ఆలయము, గదగ్ నందలి వీర నారాయణ ఆలయము, మిథున సాలిగ్రామ క్షేత్రము నందలి విజయ నారాయణ ఆలయము, బేలూరు నందలి కేశవ నారాయణ ఆలయము.

రామానుజులు తొండనూరునందు తమకు తిరుమణి తయారు చేసుకొనుటకు తగిన మట్టి కొఱకు ఆండాన్ ను నిర్దేశించిరి. ఆ రాత్రి శ్రీమన్నారాయణుడే స్వప్నమునందు సాక్షాత్కరించి యదుగిరి యందు మేలు కోట వద్ద తాను రామానుజులకై భూగర్భమున వేచి యుంటినని ఆ అర్చామూర్తిని ఉద్ధరించి అచ్చటనే దేవాలయ నిర్మాణము గావించ వలెనని  అచ్చటనే తిరుమణి కవసరమైన మట్టి కూడ లభ్యమగునని ఆదేశించిరి. రామానుజులు ఆండాన్ సహాయముతో పెరుమాళ్ళ అర్చామూర్తిని భూగర్భమునుండి వెలి దీసి మేలుకోట యందు ఆలయ నిర్మాణము గావించిరి. ఉత్సవ మూర్తి కొఱకు కలగుండు పడిన సమయమున మరల శ్రీమన్నారాయణుడే సాక్షాత్కరించి తాను ఢిల్లీ సుల్తాను వద్ద నుంటినని తనను వేంచేపు చేసికొని రమ్మని చెప్పగా ఢిల్లీ సుల్తాను కుమార్తె అంతఃపురము నందున్న ఉత్సవమూర్తిని సంపత్కుమారా(శెల్వప్పిళ్ళా) రారా" అని పిలచి కొనిపోయి మేలు కోటలో ప్రతిష్ఠించి సమస్త జనులకు దర్శనమునకవకాశము కల్పింప సకల వర్ణములకు దేవాలయ ప్రవేశ అర్హత కల్పించిరి.

అంతేకాక సమస్త జనావళికి జీవన సౌకర్యమునకు అచ్చట ఒక పెద్ద తటాకమును నిర్మింపజేసి పర్వత ప్రాంతమంతయు సస్య శ్యామలమగునట్లు గావించిరి. ఈ కార్యక్రమములన్నింటను శ్రీమాన్ ముదలి ఆండాన్ పాత్ర మిక్కిలి విశిష్ఠమైనది.

భగవద్రామానుజుల ఈ విశేష వైభవమును,మతాంతరులపై ఆయన విజయ యాత్రా వైశిష్ఠ్యమును వర్ణించుచూ ముదలి యాండాన్ మనకందిచ్చిన పంచరత్న కోశమే ధాటీ పంచకము. ఈ స్తోత్ర రచన తొండనూరులో జరిగినది. తొండనూరు యనగా భక్తుల నగరమని అర్థము. అందులకే ముందు తనియన్ శ్లోకమునందు "భక్త నగర" అని యున్నది.

ఈనాటికిని ఈ చరిత్రకు నిరూపణగా కర్ణాటక రాష్ట్రమున శ్రావణ బెళగొళలో పద్మావతీ దేవాలయమున ఆనాడు శిలపై చెక్క బడిన ధాటీ పంచక స్తోత్రము మనము చూడవచ్చును. అటులనే ఆండాన్ నిర్మింప జేసిన దేవాలయములు, తొండనూరు సరస్సు, సుప్రసిద్ధమైన సంపత్కుమారుల కోవెల, నరసింహస్వామి ఆలయము, సాలిగ్రామ తీర్థము.... ఇవి అన్నియూ ధాటీ విజయ పతాకాలు.

ధాటీ పంచకము అర్థానికి ఇంక ప్రయత్నిద్దాము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

# 1

**శ్లో.**

**పాషండ ద్రుమ షండ దావ దహనః చార్వాక శైలాశనిః**

**బౌద్ధధ్వాంత నిరాస వాసరపతిః జైనేభ కంఠీరవః**

**మాయావాది భుజంగ భంగ గరుడః త్రైవిద్య చూడామణిః**

**శ్రీరంగేశ జయ ధ్వజః విజయతేర రామానుజోయం మునిః**

పాషండ ద్రుమ షండ దావ దహనః- నాస్తికులనెడు (నిర్వీర్యులయిన) వృక్ష సమూహములకు దావాగ్ని వంటి

చార్వాక శైలాశనిః- చార్వాకులనియెడు పర్వతములపై పిడుగు వలె

బౌద్ధధ్వాంత నిరాస వాసరపతిః- బౌద్ధులనెడు చీకట్ల (పారద్రోలు) సూర్యునివలె

జైనేభకంఠీరవః- జైనులనియెడు మదించిన ఏనుగులకు సింహము వలె

మాయావాద భుజంగ భంగ గరుడః- మాయావాదులను సర్పములను జయించు గరుడుని వలె

త్రైవిద్య చూడామణిః- వేదములకు శిరోభూషణము వలె

అయమ్- (ఉండు) ఈ

రామానుజ మునిః- రామానుజులనబడు యతీంద్రులు

శ్రీ రంగేశ విజయతే జయ ధ్వజః- శ్రీరంగ నాథుని జయధ్వజము అయిన రామానుజులు. (మీకు) జయమగుగాక!

(శ్రీరంగనాథుని జయధ్వజము రామానుజులు ప్రతిష్ఠించిరి).

ఈ శ్లోకమునందు భగవద్రామానుజుల సమస్త పరమత నిరసనా వైభవము వర్ణింపబడినది. పరమతములపై దాడి కనుక శార్దూల విక్రీడితమునందు రచింపబడినది. విజయ భేరీ నినాదము గాన భక్త రామదాసు గారు " భండన భీముడు...డాండ డడాండ డాండ నినదమ్ములజాండమునిండ మత్త వేదండము నెక్కి చాటుదును" అనుచు డంఢమ్మని ఢక్క మోగించి నట్లున్నట్లు ఈ శ్లోకమున గూడ డంఢమ్మనుచునున్న శబ్దాలంకార వైచిత్రి కన పడును.

పాషండులనగా నాస్తికులు. వీరినే లోకాయతులని కూడ నందురు. ఈ మతమును ఒకప్పుడు దేవ గురువైన బృహస్పతి ఉపదేశించెనని అందురు. వీరు వేద బాహ్యులు. అనగా వేదములను విశ్వసించరు. అందుచే వేద ప్రతిపాద్యుడైన భగవానుని అస్తిత్వమును కూడ విశ్వసించరు. వీరు ఇంద్రియ గోచరములను మాత్రమే అనగా ప్రత్యక్ష ప్రమాణమును మాత్రమే పరిగణనలో తీసుకొంటారు. ఇంద్రియ గోచరముకాని ఆత్మ, పరమాత్మ ఇతర లోకములు, పాప పుణ్య ఫలములు, పునర్జన్మ ....ఇవన్నీ లేనట్లే. అనగా అనుమాన ప్రమాణము (ఊహా జనితములు గాని, అనుమితి ఫలితములు గాని) శబ్ద ప్రమాణము గాని (వేద శాస్త్రములలో చెప్ప బడినవి, ఆప్త వాక్యములుగా నుట్టంకించబడునవి) ఒప్పుకొనరు. ఇంద్రియ సుఖాలకోసం బ్రతకడమే వారికి పరమార్థము. పాప పుణ్యాలంటూ మడి గట్టుకుని ఇంద్రియ నిగ్రహాలు, దైవచింతన మున్నగునవి వారికి హుళక్కి.

అట్టి పాషండులు ప్రపంచంలో ప్రబలితే ఎవని ఇంద్రియ సుఖము కోసము వాడు ప్రవర్తిస్తే మరి లోకంలో నీతి, సత్ప్రవర్తనకు స్థానమే ఉండదు. జంతువులకు మానవులకు భేదముండదు. అంతేకాక ఈ సిద్ధాంతము బృహస్పతి నుండియో మరి యొకరి నుండియో వచ్చి ఉంటే మరి ఆ సిద్ధాంతము కూడా ఆప్త వాక్యమై ఉండాలి. ఆప్త వాక్యమును నమ్మమని చెప్పి మరల ఆప్త వాక్యమునెట్లు పరిగణిస్తారు. ఇది

స్వయంవ్యతిరేకము కదా! దైవము, ధర్మము లేకుంటే మానవ ప్రవర్తన అధ్వాన్నము గానుండును గదా! మోక్షమనెడి మహానందాభిలాష లేకుండిన మనుషులు సత్కార్యములయందు నిరాసక్తులై నిర్వీర్యులు కారా! అందుచే ఇట్టి పాషండమతమును సంపూర్ణముగా నాశనము చేయవలెను. పిచ్చి, పిచ్చిగా పెరిగిపోయిన ఈ పాషండులను నిర్వీర్యమైన (నిరుపయోగమైన) వృక్ష సమూహమును (షండ అనగా సమూహము, నిర్వీర్యము అని రెండు అర్థములను పరిగణించవచ్చును) భగవద్రామానుజులు అనెడు దావాగ్ని సమూలముగా కాల్చి వైచినది. ఇందులకే రామానుజుల వాళ్ తిరునామములయందు "అఱు శమయచ్చెడి యదనై అడి అఱుత్తాన్ వాళియే " అని ప్రస్తుతింతుము. దీనినే రామానుజ నూత్తందాది యందు తిరువరంగత్తముదనార్ " నాట్టియ నీశచ్ సమయంగళ్ మాణ్డన" మరియు "తర్కచ్ శమణరుమ్ సాక్కియప్ పేయ్గళుమ్ .....నీశరుమ్ మాణ్డనర్" అని వర్ణించిరి.

నాస్తికులయిన ఈ పాషండులు అనాగరికులు, ఆసురీ లక్షణములు కలవారు అయి ఉండగా, ఈ నాస్తికులయందే కొలదిగా నాగరీకత కలిగి సమాజము నందు ప్రవర్తించు మఱి యొక వర్గము చార్వాకులు. అనగా ఇష్టమైన సంభాషణమును చేయువారు. మనకు క్రమ బద్ధత లేక ఇచ్చ వచ్చినట్లు ప్రవర్తించుమనిన బాగుగా యుండును కదా! వీరలట్టివారు. వీరును ప్రత్యక్ష ప్రమాణమును మాత్రమే పరిగణించెదరు. వీరు తమ వాక్చాతుర్యముతో ఇంద్రియ సుఖముల కొఱకు జీవించు చుందురు. పర్వతముల వలె మిక్కిలి స్థిరముగా నుండెడి ఈ చార్వాకులను భగవద్రామానుజులు పిడుగు వలె చూర్ణప్రాయము చేసి నశింప జేసిరి.

గౌతమ బుద్ధుడు ప్రచారము చేసిన వేద బాహ్య మయిన మతము బౌద్ధము. వీరు కూడా వేదములను, పరమాత్మను విశ్వసించరు. సర్వమ్ దుఃఖ మయమను నిరాశా, నిస్పృహలనుండి బయలుదేరిన మతమిది. ఈ జీవితము దుఃఖ మయమని, అందుచేత కోరికలు విసర్జించి సర్వము అశాశ్వతము, అనగా క్షణికము అని తెలుసుకొని దుఃఖ రహితమైన శూన్య స్థితిని పొందడమే పరమావధి వీరి మతంలో. ఆత్మ అస్థిరము. కనుక పేరు జన్మలున్నా అన్ని జన్మలలో ఆత్మ ఒకే రకంగా ఉండదు. బాహ్య విషయాలు(ప్రపంచము), అంతర విషయాలు( ఆత్మ) ఈ రెంటినీ శూన్యప్రాయముగా చేసుకొనిన కర్తవ్యము. వీరిలో వివిధ వర్గాల వాళ్ళున్నారు. ..వైభాషికులని, సౌత్రాంతికులని, మాధ్యమికులని, యోగాచారులని. బాహ్య విషయాలూ, ఆత్మా కూడా ఉన్నవని అంటూ వాటి శూన్య స్థితికి వచ్చేవారు వైభాషికులు. ఆత్మ ఉన్నది కాని బాహ్య ప్రపంచము లేదని చివరకు శూన్య స్థితికి చేరుకొను వారు సౌత్రాంతికులు. బాహ్య ప్రపంచమూ, ఆత్మ కూడా లేవంటూ శూన్య స్థితిని చేరుకొనేవారు మాధ్యమికులు. బాహ్య ప్రపంచము లేదు గాని ఆత్మ ఉన్నదని యోగ, ధ్యానములతో శూన్య స్థితిని పొందువారు యోగాచారులు. ఏతావతా శూన్యస్థితియే పరమావధి అంటే అట్టి స్థితి కోసం ఎవరు ప్రయత్నించును. అందుచే మన జాతి నిర్వీర్యమై పరులకు పాదాక్రాంతమైపోయినదని భగవద్రామానుజులు అట్టి స్థితినుండి

మనలను ఉద్ధరించి రక్షించేరని కొందరు చరిత్రకారులే చెబుతారు. బౌద్ధుల శూన్యవాదము జాతిని చీకటియందు పడవైచి సరి అయిన దారి కనపడనట్లు చేస్తుంది. అట్టి చీకట్లను పారద్రోలి జ్ఞాన ప్రకాశమును అందిచ్చిన దివాకరులే రామానుజులు.

( ఈ గౌతమ బుద్ధుడు శ్రీమన్నారాయణుని అవతారముల యందలి బుద్ధావతారము కాదు. బుద్ధావతారము నందు కొంతమంది అసురులు వైదిక క్రియలు చేస్తూ, తదార్జిత బలము వలన లోకాలను హింసిస్తూంటే బుద్ధావతారముదాల్చి వారలను వైదిక నిష్ఠ నుండి మరల్చి తదనంతరము వారలను నశింప చేసిన అవతారము బుద్ధావతారము. గౌతమ బుద్ధుడు కూడా వేదములను నిరసించేడు కాబట్టి కొంతమంది కొలదిగా కలగుండు పడతారు. కాని వీరిరువురు వేఱ్వేఱే).

ఋషభ దేవుని ప్రారంభమై వర్ధమాన మహావీరునితో ప్రాచుర్యము పొందిన వేద బాహ్యమైన మఱియొక మతము జైనము. వీరి ప్రకారము జీవిత పరమార్థము అన్ని బంధముల నుండి విడివడి పుణ్యకార్యముల వలన పునీత మైన ఆత్మ స్థితి. వీరు ఆత్మ దేహపరిమాణ, ఆకారములను బట్టి ఒక్కొక్క జీవములో ఒక్కొక్క పరిమాణములో ఉంటుందంటారు. ప్రత్యక్షముగా గోచరమగు ప్రకృతి శూన్యమని బౌద్ధులంటే, జైనులు ఉండవచ్చును, ఉండకపోవచ్చును, ఉండీ ఉండక పోవచ్చును, చెప్పలేము అని అంటూ సప్త భంగీ నయమని ఏడు విధములను వ్యవహారం చెబుతారు. ఇద్దరు సూర్యులు, ఇద్దరు చంద్రులు జారి పోవు భూమి ఉన్నవి అనుచూ అర్థరహితములయిన ప్రాతిపదికలతో వాదింతురు. ఆప్త వాక్యమును(శబ్ద ప్రమాణమును) విశ్వసించని వీరు వారి మత గురువుల శాస్త్రమును ఎట్లు అంగీకరించెదరు. ఇట్టి జైన మత గురువులను 12,000 మందిని ఒకే సారి సహస్ర ముఖుడై వాదించి జయించిన వారు రామానుజులు. కావున మదించిన ఏనుగుల వంటి జైనులను జయించిన సింహము భగవద్రామానుజులు.

మాయా వాదమనగా అద్వైత దర్శనము. ఈ దర్శనమునందు సర్వ విశేష శూన్యమై చిన్మాత్ర స్వరూపమైన బ్రహ్మ మొక్కటియే సత్యము. అది స్వయం ప్రకాశకమయిననూ అనాదిగా వచ్చిన అవిద్యచే బాధితమై భేద భ్రాంతికి లోబడి ఉంటుంది. అట్టి బ్రహ్మము స్వస్వరూపము గుర్తించక మాయావృతమై జ్ఞాత, జ్ఞేయములని భేద భ్రాంతిని కలిగి యుంటుంది. బ్రహ్మ భిన్నమై నట్లు కనపడు ఈ ప్రపంచమంతయు ఆ బ్రహ్మమునందే అవిద్యాకల్పితమై మిథ్యాభూతమైనది. (మాయచే ఆవృతమైనది). ఈ అవిద్యచే ఆవృతమైన పర బ్రహ్మము నుండి తత్త్వమసి, అహమ్ బ్రహ్మాస్మి వంటి మహా వాక్య జ్ఞానము వలన భేద భ్రాంతి తొలగి పోయి బ్రహ్మ స్వరూపమవగతమవుతుంది. ( ఒక త్రాడు ను చూచి పాము అనుకున్నప్పుడు ఆప్త వాక్యము వలన అది పాము కాదని త్రాడని అవగత మైనట్లు ). ఇందు బ్రహ్మ

అస్తిత్వమును అద్వైతులు స్వీకరించిననూ బ్రహ్మ తప్ప ప్రత్యక్షముగా కనపడుచున్నదంతయు అయదార్థమనియూ, లేనిదనియూ చెప్పెదరు. ఈ వాదము సర్వము శూన్యమను బౌద్ధమునకు చాల పోలియుండును. అందులకే దీనిని ప్రచ్ఛన్న బౌద్ధమని కూడ వ్యవహరింతురు. అంతే కాక శాస్త్రమును ప్రమాణముగా స్వీకరించిననూ శాస్త్రమునందు అభేద శ్రుతులు మాత్రము స్వీకరించి భేద శ్రుతులు పరిగణించరు. ప్రత్యక్షముగా నున్న ప్రపంచమును అయదార్థమని అనుట ఎట్లు. ఒక పదార్థము లేదనిన అచట లేదు, ఆ సమయమున లేదు అని తెలియ వలెను గాని అయదార్థము అనుట అసంబద్ధము. అటులనే శ్రుతులయందు కొంత భాగమును మాత్రము పరిగణించి తక్కిన భాగమును లెక్కచేయకుండుట సరికాదు. ఇట్టి సర్పములవంటి (రజ్జు సర్ప భ్రాంతి యే మాయ అనియెడు) మాయావాదులను గరుడుని వలె భగవద్రామానుజులు తమ విశిష్టాద్వైత సిద్ధాంతముతో జయించిరి. విశిష్టాద్వైతమునందు ప్రత్యక్షముగా కానిపించు చున్నది ఎల్లయూ సత్యమే. తత్త్వములు మూడు. పరమాత్మ, ప్రకృతి, ఆత్మ. ప్రకృతి, ఆత్మ పరమాత్మకు శేషభూతములై శరీర శరీరి భావమున యుండును. అందుచే భగవద్రామానుజులు భేద, అభేద, ఘటక శ్రుతులన్నియు సమన్వయము చేసి యుక్తి యుక్తముగా శ్రుతులన్నిటిని పరిగణనలోనికి తీసి కొని బోధించిరి. అందులకే రామానుజులను ముదలిఆండాన్ త్రైవిద్య చూడామణి అని కీర్తించుచున్నారు. అనగా సమస్త వేదములకు శిరో భూషణమై వేదార్థములను సరసముగా ప్రకాశింప చేసిన వారు భగవద్రామానుజులు. వారు తన సిద్ధాంతముతో శ్రీరంగేశుని జయ పతాక ప్రతిష్ఠించిరి. అనగా శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని నిరూపించి, చిదచిత్తులు ఆయనకు శేషభూతములని వివరించి మనలనుద్ధరించిరి. వారికి జయమగు గాక!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

# 2

భగవద్రామానుజులు శ్రీరంగమును విడిచివెళ్ళి నప్పుడు త్రిదండమును అక్కడే వదలివేసి వెళ్ళేరు అని అనుకున్నాము కదా! మరల త్రిదండమును రామానుజులు తొండనూరు లో చేపట్టేరు. ఈ త్రిదండము భగవత్సమానమైనది అని అనుకున్నాము కదా! అట్టి త్రిదండాన్ని వర్ణిస్తున్నారు రాబోవు రెండు శ్లోకాలలో.

**శ్లో.**

**పాషండ షండ గిరి ఖండన వజ్ర దండాః**

**ప్రచ్ఛన్న బౌద్ధ మకరాలయ మంథ దండాః**

## వేదాంత సార సుఖ దర్శన దీప దండాః

## రామానుజస్య విలసంతి మునేః త్రిదండాః

పాషండ షండ - పాషండులనియెడు నాస్తికుల సమూహములను

గిరి - పర్వతములను

ఖండన- భేదించగా

వజ్ర దండాః- వజ్రాయుధము వంటిదియు

ప్రచ్ఛన్న బౌద్ధ - ప్రచ్ఛన్న బౌద్ధులనబడు అద్వైతులను

మకరాలయ- మొసళ్ళకు నిలయమైన సముద్రమునకు

మంథ దండాః- చిలుకు కవ్వము వంటిదియు

వేదాంతసార- ఉపనిషత్ సారములను

సుఖ దర్శన- సులభముగా తెలుసుకొనుటకు

దీప దండాః- దివిటీ వంటిదియు

రామానుజస్య మునేః - రామానుజులను యతిరాజుల యొక్క

త్రిదండాః- త్రిదండములు( త్రిదండము ఒక్కటే అయినా "పూజాయామ్ బహువచనమ్" అనినట్లు గౌరవవాచకముగా బహువచనమును వాడబడినది)

విలసంతి- విలసిల్లును గాక!

రామానుజుల కాలమునందు పాషండులనియెడు నాస్తికులు పర్వత సమూహములవలె యుండిరి. వారలను రామానుజుల త్రిదండము వజ్రాయుధము వలె భేదించినది. (మనకు రామాయణమునందు పర్వతములకు పక్షులవలె ఱెక్కలుండెనని, ఆ ఱెక్కలను దేవేంద్రుడు వజ్రాయుధముతో ఖండించెనని మనము చదివి యుంటిమి. ).

రామానుజుల త్రిదండము ప్రచ్ఛన్న బౌద్ధులనబడు అద్వైతులు కుదృష్టులు. శ్రుతి సమన్వయము సంపూర్ణముగా చేయక ప్రమాదకరమగు అర్థములు చెప్పుదురు. వారు ప్రవర్తించు సమాజము

మొసళ్ళున్న సాగరము వంటిది. అట్టి ప్రమాద భరితమైన సాగరమును చిలికి, వారి వారి వాదములనెల్ల చిమ్మివైచి అందుండి అమృతము తీయుటకుపయోగించు కవ్వము వంటిది రామానుజుల త్రిదండము.

వేదముల అర్థమును సమన్వయము చేసికొని దర్శించుట బహు క్లిష్టము. వేదముల యందు కొన్ని శ్రుతులు భగవానుడు గుణాశ్రయుడని చెప్పును. కొన్ని శ్రుతులు నిర్గుణుడని తెలుపును. రామానుజులు భగవానుడు కళ్యాణ గుణాకరుడని, దోష గుణములు లేని వాడని వివరించిరి. అట్లే ఛాందోగ్యోపనిషత్ నందు " సత్ ఏవ ...ఇదమగ్ర ఆసీత్, ఏకమేవ, అద్వితీయమ్, తత్త్వమసి" అని యుండును. అనగా " ఈ సృష్టికి ముందు సత్ మాత్రమే యున్నది. అది ఒక్కటియే ఉన్నది. అది అద్వితీయము.

.....అది నీవు అయి ఉన్నావు. " దీనిని బట్టి సత్ తప్ప మఱి యొకటి లేదనియు ఈ జీవులందరు సన్మాత్రమే అని అనిపించును. కాని వేరొక శ్రుతిలో "భోక్తా, భోగ్యమ్, ప్రేరితారమ్ చ మత్వా" ( శ్వేతాశ్వరోపనిషత్తు ) అని యుండును. అనగా భోక్త, భోగ్యమ్,తత్ప్రేరకము అని మూడు తత్త్వములున్నట్లు తెలియును. ఇట్టి పరస్పరము వ్యతిరేకము వలె నున్నట్లు కాన్పడు శ్రుతులను భగవద్రామానుజులు సమన్వయ పరచి బ్రహ్మమునకు జీవ, ప్రకృతి తత్త్వములు అపృథక్ స్థితి లో అనగా బ్రహ్మము తో నెల్లప్పుడు కలసి బ్రహ్మము శరీరికాగా ప్రకృతి జీవ తత్త్వములు తచ్ఛరీరములుగా తచ్ఛేషభూతములుగా నుండునని వివరించిరి. తత్త్వమసి యనగా నీవు అనగా జీవుడు ఆ పరమాత్మను అంతర్యామి గా కలిగి ఉన్నావు అని అర్థము. అటులనే కొన్ని చోట్ల ఇంద్రుడు బ్రహ్మమని, మరొక చోట అగ్ని బ్రహ్మమని, మరొకచోట ప్రాణము బ్రహ్మమని బ్రహ్మమని ఉన్నపుడు భగవద్రామానుజులు వీటికన్నటికి అంతర్యామి గా నుండి వాటిని నియమించుచుండు పరమాత్మ కే బ్రహ్మ శబ్దము వర్తించునని వివరించిరి. భగవద్గీత యందు " మయా తతమిదమ్ సర్వమ్ జగత్", "మత్స్థాని సర్వ భూతాని" అని నవమోధ్యాయమునందు, "క్షేత్రజ్ఞమ్ చాపి మామ్ విద్ధి" అని పదమూడవ అధ్యాయము నందున్నది. ఈ వాక్యములు పరమాత్మ యు, జీవ ప్రకృతులు అని మూడు తత్త్వములున్నట్లు ఒకసారి ఆత్మయు, పరమాత్మయు ఒక్కటే అని మఱియొక సారి ఉన్నట్లు అనిపించును. కాని అది సరి కాదు. ఆత్మ, పరమాత్మ ఒక్కటియే అని కాదు. దీని అర్థము ఆత్మ పరమాత్మకు శరీర శరీరి భావమున అపృథక్సిద్ధముగా, శేషభూతముగా నుండునని అర్థము. ఇట్లు శ్రుతులను అర్థము చేసికొనుటకు బ్రహ్మ సూత్రముల భాష్యము శ్రీభాష్యమును ప్రసాదించుటయే కాక వేదార్థ సంగ్రహము, వేదాంత దీపము, వేదాంత సారము, భగవద్గీతా భాష్యము మున్నగు గ్రంథములను కృపజేసి మనలను ఉద్ధరించిరి. అందులకే ముదలి ఆండాన్ స్వామి రామానుజుల త్రిదండమును వేదాంతసార సుఖ దర్శన దీపదండమని అభి వర్ణించిరి. అట్టి రామానుజుల త్రిదండము ఎల్లప్పుడును విరాజిల్లుచు నుండు గాక!

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

# 3

భగవద్రామానుజుల త్రిదండాన్ని రూపకాలంకారం లోను, ఉల్లేఖాలంకారంలోను వర్ణిస్తున్నారు ముదలి ఆండాన్ 2,3 శ్లోకాలలో. ఉపమానాన్ని ఉపమేయముతో పోల్చడంకాక సమానముగా ఆరూపించి వర్ణించడాన్ని రూపకాలంకారమంటారు. అలాగే ఒకే పదార్థాన్ని అనేక ఉపమానములతో వర్ణిస్తే దాన్ని ఉల్లేఖాలంకారమంటారు. " దండమ్ దశ గుణమ్ భవేత్ " అనునట్లు రామానుజుల త్రిదండమునకు పది విశేషాలు ఈ 2,3 శ్లోకాలలో స్వామి ముదలి ఆండాన్ ప్రతిపాదించేరు. (రామానుజులకు త్రిదండ సమానములే కదా స్వామి ). పరమతములను, పారద్రోలడం, వేదాంతసారం దర్శించుటకు తగిన గ్రంథ రచన చేయడం ఒక ఎత్తయితే, మనలో దోషాలను పారద్రోలి, సరి అయిన దారి చూపి మనలను ఉద్ధరించడం ఇంకొక ఎత్తు. ఆ విషయాన్నే ప్రస్తావిస్తున్నారు 3 వ శ్లోకంలో.

**శ్లో.**

**చారిత్రోద్ధార దండమ్ చతుర నయపథాలంక్రియా కేతుదండమ్**

**సద్విద్యా దీపదండమ్ సకలకలికథా సంహృతేః కాలదండమ్**

**త్రయ్యంతాలంబదండమ్ త్రిభువన విజయ ఛత్రసౌవర్ణ దండమ్**

**ధత్తే రామానుజార్యః ప్రతికథక శిరో వజ్ర దండమ్ త్రిదండమ్**

చారిత్ర- మన(జీవుల) జీవితమునకు లేదా పూర్వ చరిత్రకు లేదా ప్రవర్తనమునకు సంబంధించిన (చెడు విషయముల నుండి)

ఉద్ధార- ఉద్ధరించెడి లేదా లేవనెత్తెడి

దండమ్- దండము

చతురనయ పథ- చతుర్విధ పురుషార్థముల యందు ఉత్తమమైన మోక్షమార్గమునలేదా మంచి తెలివైన దారియందు లేదా నాల్గు పాదముల నడచు ధర్మ మార్గమున

అలంక్రియా- అలంకరింప, వికసింప నుండు

కేతు దండమ్-వెలుగు కఱ్ఱ

సద్విద్యా- సద్విద్య ను, మంచి విజ్ఞానమును (తెలియచేయు)

దీప దండమ్- దీప దండము

సకల కలి కథా- సమస్తమగు కలి పురుషుని కార్యములను, దుష్కర్మలను

సంహృతే - సంహరించు

కాలదండమ్ - యమదండము

త్రయ్యంతాలంబదండమ్ - ఉపనిషత్తులకు ఆలంబనమైన దండము

త్రిభువన విజయ - ముల్లోకములను జయించి(తన ఛాయలోనికి రప్పించుకొనినట్టి)

ఛత్ర సౌవర్ణ దండమ్- గొప్ప సువర్ణ ఛత్ర దండము(గొడుగు కఱ్ఱ)

ప్రతి కథక శిరో- ప్రతివాదుల( ఇతర మతస్థుల) శిరస్సులకు

వజ్ర దండమ్- వజ్రాయుధము

త్రిదండమ్- అట్టి త్రిదండమును

రామానుజార్యః- భగవద్రామానుజులు

ధత్తే- ధరించిరి

భగవద్రామానుజులకు శ్రీరంగ నాథులు వరము కోరుకొనమనినపుడు భగవద్రామానుజులు తన వారందరికీ అంటే శ్రీవైష్ణవ ధర్మాన్ని ఆచరించే వారికందరికీ మోక్షము ప్రసాదించవలెనని కోరేరు. తత్ప్రకారంగా రామానుజులను ఉభయవిభూతులకు అంటే నిత్య విభూతి, లీలా విభూతులకు నాయకునిగా "ఉడయవర్" గా నియమించి రామానుజ సంబంధులకందరకూ రంగనాథులు మోక్షమనుగ్రహించనారు. ఒక సారి సింహాచలమున కృష్ణమాచార్యులను గొప్ప తన పాటకు అనుదినము నారసింహుడు వచ్చి నర్తించునను అహంకారముతో రామానుజలను లెక్క చేయకుండిన రామానుజులు కృష్ణమాచార్యులను తనకు మోక్షము గలదా అని నారసింహుని అడుగ మనిన నారసింహుడు కృష్ణమాచార్యుల వారికి ఎవరికైనను రామానుజులు అనుగ్రహించిననే మోక్షము గలదని వాక్రుచ్చెనట. అట్లు మన జీవితములు సరిదిద్ది మోక్షమునిప్పించు వారు భగవద్రామానుజులు. మనో వాక్కాయైః అనాది కాల ప్రవృత్త అనంత అకృత్య కరణ, కృత్యాకరణ, భగవదపచార, భాగవదాపచార అసహ్యాపచార రూప నానావిధ అనంతాపచారాన్, ఆరబ్ధ కార్యాన్, అనారబ్ధ కార్యాన్, కృతాన్, క్రియమాణాన్, కరిష్యమాణాంశ్చ సర్వాన్ అశేషతః క్షమస్వ అని మనచే లక్ష్మీ పురస్సరంగా శ్రీమన్నారాయణునికి శరణాగతి చేయించి ఉద్ధరించెడివారు భగవద్రామానుజులు. గోష్ఠీపూర్ణులు మంత్ర రహస్యమును ఎవ్వరికీ చెప్పవద్దని చెప్పినా జనానీకము బాగుకొఱకు గుర్వాజ్ఞనే ధిక్కరించిన కరుణామయులు రామానుజులు. తన కాలములో నెంతమందినో ఉద్ధరించుటయే కాక తరువాతి తరములకు తగిన వ్యవస్థ ను 74 మంది

సింహాసనాధిపతులను, 4 గురు భాష్యసింహాసనాధిపతులను ఇంకా అనేకులైన సన్యాసులను, పరమైకాంతులను, భగవద్భాగవతర కైంకర్యపరులను..... ఏర్పరచి ఇలా ఎన్ని విధాలుగానో మన ఉద్ధరణకై త్రిదండమ్ ధరించిన వారు రామానుజులు. వర్ణ, లింగ, జ్ఞాన భేదములు లేక అంతమందికీ మోక్షము నిప్పింప సంకల్పించుకొనిన వారు రామానుజులు. వేదాధ్యయనమునకు అందరకూ అధికారముండదని, అజ్ఞానులకూ, ఆడువారికీ తదితరులకూ వీలయినట్లు ఆళ్వార్ ప్రబంధములను ప్రాచుర్యమునకు తెచ్చి జీవాత్మ కర్తవ్య ధర్మములు భగవచ్చేషత్వ పారతంత్ర్యములేనని, శరణాగతి వలన ఈ జన్మనందే మోక్షము పొందగలమని నుడివి, నిత్యగ్రంథము అను గ్రంథమునందు భగవత్కైంకర్య విధానము తెలిపి తన సిద్ధాంతముతో మనలను ఉద్ధరించిన రామానుజుల త్రిదండము ఇచట వర్ణితమైనది.

కలి కాలమునందు కలి పురుషుని ప్రభావము చాల దారుణముగానుండును. అంతకు ముందు కృత, త్రేతా, ద్వాపర యుగములలో చేయ బడిన యజ్ఞ యాగాదులను సక్రమముగా కలి యుగమున చేయుట బహు దుష్కరము. అందుచే భగవద్రామానుజులు యజ్ఞ యాగాదులకు పెద్ద పీట వేయక ఎట్టివారైనను, ఎట్టి పరిస్థితులలోనైనను, ఎట్టి కఠోర నియమములు లేక సంపూర్ణ విశ్వాసముతో ఒక్క సారి మాత్రము లక్ష్మీ సమేతుడైన శ్రీమన్నారాయణునికి వద్ద చేయగల శరణాగతి విధానము మనకొరకు అందిచ్చిరి. తన చరమ దశ యందు శ్రీభాష్యమ్, ద్రవిడాగమమ్.... అని ప్రారంభంచి శ్రీభాష్యమ్, ద్రావిడ ప్రబంధాలు చదవడం కుదరక పోతే ఆలయ సేవయో, అదీ అవకుంటే క్షేత్ర నివాసమో, కాకున్న సంతత ద్వయ మంత్రోచ్చారణమో లేదా భాగవత సమాశ్రయణమో అని అత్యంత సులభమైన మార్గాలు ఉపదేశించేరు. తన మార్గాన్ని అనుసరించేవారికందరకూ మోక్షమునీయ వరము పొంది కలి ప్రభావము మనపై లేకుండునట్లు చేసేరు. అందులకే నమ్మాళ్వార్ భవిష్యదాచార్యులు రామానుజులు వచ్చెదరు కనుక వైష్ణవులకందరక జయమగునని, కలి ప్రభావమిక నుండదని "పొలిగ పొలిగ...." అని తమ తిరువాయ్ మొళి నందు భవిష్య వాణి పలికిరి. రామానుజులు సాలిగ్రామ తీర్థమున ముదలి ఆండాన్ ను నిలువమని ఆ భాగవత శ్రీపాద తీర్థమహిమ వలన అచటనున్న పామర జనములనెల్ల పునీతులను చేసి భాగవత శ్రీపాద తీర్థమహిమ నిరూపించిరి. అట్టి భగవద్రామానుజుల త్రిదండము కలిమనుజుని పోకడలను ధిక్కరించి వాని దుష్కర్మలను దునుమాడు మారణ దండము.

ఉపనిషత్తులయందు పరవిద్యయే పరబ్రహ్మ ప్రాప్తి సాధనమని చెప్పబడినది. భగవానుని పొందునకు కర్మ, జ్ఞాన, భక్తి, ప్రపత్తులు ఉపాయములని కొందరంటారు. కాని ఉత్తమోత్తమమైన ఏకైక ఉపాయము భగవానుడే. భక్తి, ప్రపత్తులు సహకార అంగములు మాత్రమే. ఈ రహస్యమును తెలిపిన వారు భగవద్రామానుజులు. అందుచే మనము మన కర్మలన్నీ భగవన్ముఖ వికాసమునకై ఆయన ప్రీతి కొఱకై

ఆయన నిర్దేశించిన శాస్త్రము ప్రకారము చేయవలెను. అటులనే నాల్గవ పురుషార్థమైన మోక్షము మనము పొంది పరమ పదమున భగవత్కైంకర్యమున అనవధికాతిశయమైన పరమానందమును పొందెదము. చరమ శ్లోకమున మామ్ ఏకమ్ శరణమ్ వ్రజ అని భగవానుడు పలికిన రహస్యమును తిరక్కోష్ఠియూరు నందు కోవెల గోపురమెక్కి సమస్త జనులకు చాటిన మహాను భావులు రామానుజులు. మనకందరకు అట్టి మంచి మార్గమును చూపు దీపిక వారు ధరించు త్రిదండము.

ఛాందోగ్యోపనిషత్ నందు సద్విద్యా ప్రకరణమని యున్నది. ఈ ప్రకరణమునందు శ్వేతకేతువు ఉద్దాలకుని పుత్రుడు. విద్యాభ్యాసము పూర్తిచేసి తండ్రి వద్దకు ఇంచుగ గర్వము తో అరుదెంచును. తండ్రి కుమారునకు హితము తెలుపవలెనని "దేని గురించి తెలుసుకుంటే సర్వము తెలుసుకొనినట్లవుతుందో ఆ ఆదేశాన్ని తెలుసుకున్నావా " అని ప్రశ్నిస్తాడు. తెల్లబోయిన కుమారుడిని తీసికొని కుమ్మరి వద్దకు తీసికొని పోయి మట్టిని, దానితో తయారైన ఘటాది పదార్థములను చూపిస్తాడు. అటులనే బంగారపు కొట్టు యందు బంగారమును, దానితో తయారు అయిన వస్తువులను, ఇనుప వస్తువులను చేయువాని వద్దకు కొనిపోయి ముడి ఇనుమును, తన్నిర్మిత అయఃపదార్థములను చూపించి, "సత్ ఏవ సోమ్య ఇదమ్ అగ్రమ్ ఆసీత్, ఏకమ్ ఏవ, అద్వితీయమ్, యథా సోమ్య ఏకేన మృత్పిండేన సర్వమ్ మృణ్మయమ్ విజ్ఞాతమ్ స్యాత్ వాచారంభణమ్ వికారః మృత్తికా ఇతి ఏవ సత్యమ్ " అని వివరించి "తత్ త్వమ్ అసి " అని తెలియ జేస్తాడు. దీనినే సద్విద్యా ప్రకరణము అంటారు. దీనికి అర్థాన్ని అద్వైతులు సత్ ఒక్కటే ఉన్నది. అందు సజాతీయ భేదాలు, విజాతీయ భేదాలు, స్వగత భేదాలు లేవు. అని అర్థము చెబుతారు. అంటే సత్ తప్ప మిగిలినదంతా ఈ జీవుళ్ళు, ప్రకృతి ఇదంతా ఏమిటి అంటే ఇదంతా మిథ్య, అయదార్థము అని చెబుతారు. మఱి జీవుళ్ళకు మోక్షమంటే ఆ బ్రహ్మ లో కలసిపోయి తమ అస్తిత్వము కోల్పోవడమే నంటారు. అస్తిత్వము లేని స్థితి మోక్షమంటే అది ఎవరు కోరు కుంటారు. భగవద్రామానుజులు ఈ ప్రకరణానికి సమగ్రమైన, సమంజసమైన వివరణ ఇచ్చేరు. పరమాత్మ ప్రకృతి, జీవులకు కారణమై ( ఉపాదాన, నిమిత్త, సహకారి కారణములన్నియు తానే అయి) తచ్ఛరీరి గా ఉండునని, అందుచే జీవ, ప్రకృతులు ఆ పరమాత్మయే అంతర్యామి గా కలిగి యుండునని ఈ ప్రకరణమునకు స్థూలముగా అర్థము. అందుచే పరమాత్మకును ప్రకృతి, జీవులకును సంబంధము తెలిసి సకల జగత్కారణ తత్త్వమైన పరమాత్మకు మనము శేషభూతులమని తెలుసుకొని ఆ ప్రకారము నడిచి కొనుట సమస్త జీవరాశి ధర్మము. ఈ విజ్ఞానమును తెలియచేసినది ాామానుజుల త్రిదండము.

సత్ గురించి తెలుపు విద్య సద్విద్య. అనగా సత్ అనగా నేమి, తానెవరు,తాను సత్ ను పొందుటకు ఉపాయమేది, అట్లు పొందుటకు విరోధములేవి, పొందిన ఫలమేమి అను 5 విషయములను అర్థ పంచకమని అంటారు. ఈ అర్థ పంచక జ్ఞానము కలిగించి మనలను విరజ ఆవలి గట్టున అమానవ పురుషునకందీయ దారి తోపు కర దీపిక రామానుజుల త్రిదండము

ఉపనిషత్తులకు ఊత గఱ్ఱ రామానుజుల త్రిదండము. రామానుజులకు ముందు కాలమున ఉపనిషత్తులకు పలువురు పెక్కు విధములుగా తప్పు అర్థములు చెప్పుటవలన జనానీకమునకు వేదాంతములయందు విశ్వాసము సన్నగిల్లెను. కొందరు (పూర్వ మీమాంసావాదులు) వేదములయందు కర్మ కాండమును మాత్రము పరిగణించి అతి ముఖ్యమైన బ్రహ్మను ప్రతి పాదించు బ్రహ్మ కాండమును పరిత్యజించిరి. బౌద్ధ, జైన, చార్వాకాది మత గురువులు వేదములపై విశ్వాసముంచక నాస్తిక వాదములు ప్రవచింపదొడగిరి. కుదృష్టులైన అద్వైతులు నిర్గుణ శ్రుతులను పరిగ్రహించి సగుణ శ్రుతులను లెక్క చేయక వ్యాఖ్యానించిరి. ఇంకను భాస్కర, యాదవ ప్రకాశక, భాట్ట, మండన మిశ్రాది ప్రభృతులు స్వకపోల కల్పితములయిన వ్యాఖ్యానములతో వేదముల అస్తిత్వమునకే ఎగ్గు కల్గించిరి. ఉపనిషత్ప్రతిపాద్యుడైన బ్రహ్మ మెవ్వరో తెలియసేరక వివిధ దేవతలను మతములను అనుసరించువారు తండోప తండములైరి. అట్టి పరిస్థితుల యందు. " తత్తు సమన్వయాత్" అను బ్రహ్మ సూత్రము న పలికినట్లు సరస సమంజసముగా సంపూర్ణముగా శ్రుతులను సమన్వయము గావించి వేదములను నిలపెట్టి శ్రీమన్నారాయణ పరతత్త్వమును సిద్ధాంతీకరించి తద్వారా మనలను ఉద్ధరించుటకు ఉపయోగపడిన ఊత గఱ్ఱ భగవద్రామానుజుల త్రిదండము.

రామానుజుల త్రిదండ మహిమ వలన వారి సిద్ధాంతమునంగీకరించిన వారు వారి చిన్ననాటి గురువులు. ఆనాడు లక్ష్మణార్యులను నిరసించి, తిరస్కరించుటయే కాక వారికి కీడు తల పెట్టిన యాదవ ప్రకాశులే రామానుజుల శిష్యత్వము కొఱకు వారిని ప్రార్థించతిరన్న మఱి వేరొకరి గూర్చి చెప్ప వలసినదేమి. వారి వేదాంత సూత్ర భాష్య గ్రంథమునకు సంతసించిన శారదాదేవి ఆగ్రంథమునకు శ్రీభాష్యమని పేరిడినది. 12,000 జైన గురువులను ఒకేసారి వాదించి, జయించిన ధీశాలి రామానుజులు. యావద్భారతావని పర్యటించి విశిష్టాద్వైత సిద్ధాంతమును ఎల్లెడల వ్యాప్తి చేసిరి. వారి సిద్ధాంతము వారినుండియే గ్రహించవలెనని భగవానుడు వైష్ణవనంబి గా వచ్చి తిరుక్కురుంగుడిలో రామానుజులవద్ద శిష్యత్వము చేసెడు. కర్ణాటకమునందు విష్ణువర్ధనుడి నుండి దేహలీ దేశమున ముస్లిమ్ నవాబువరకు భగవద్రామానుజులకు పాదాక్రాంతులయినారు. ఈ రకంగా పరమాత్మ మొదలు, సామాన్య జనానీకము వరకు తన సిద్ధాంతముతో జయించిన రామానుజుల త్రిదండము ఎల్లరనూ తన ఛాయలోనికి రప్పించుకొని వారిని రక్షించునట్టి ఛత్ర దండము.

రామానుజుల త్రిదండమును ప్రతివాదుల శిరస్సులకు వజ్రాయుధము వంటిదని కీర్తిస్తున్నారు. ఉదాహరణకు అద్వైతుల వాదమునందు సామాన్యాధికరణము ఎలా కుదరదో నిరూపించినప్పుడు, అద్వైతులు ప్రతి పాదించునట్లు బ్రహ్మ యందు అవిద్య ఉండుట ఎట్లు సాధ్యము కాదో సప్త విధ

అనుపపత్తులతో ( ఆశ్రయ అనుపపత్తి, తిరోధాన అనుపపత్తి, స్వరూప అనుపపత్తి, అనిర్వచనీయ అనుపపత్తి, ప్రమాణ అనుపపత్తి, నివర్తక అనుపపత్తి, నివృత్తి అనుపపత్తి) సిద్ధాంతీకరించినప్పుడు పరమతస్థులు వజ్రాభిహతశిరస్కులైనట్లు తలలుతిరిగి దాసోహమనవలసినదే తప్ప ఎదురాడుటకు అవకాశముండదు. అట్టి వజ్ర దండము రామానుజ త్రిదండము.

ఉపపత్తి అంటే నిరూపణం కదా! అంటే రాముడు లక్ష్మి కుమారుడంటే లక్ష్మిది, రామునిది DNA పరీక్షించి రాముడు లక్ష్మి కుమారుడని నిరూపించ వచ్చు. అనుపపత్తి అంటే నిరూపణాసంభవత్వము. అనగా లక్ష్మి గొడ్రాలు అయితే రాముడు లక్ష్మి కుమారుడని నిరూపించడం సాధ్యము కాదు. ఇదే అనుపపత్తి. ఇంకొక ఉదాహరణము అద్వైతులు బ్రహ్మమును అవిద్య ఆచ్ఛాదించి నపుడు అది జీవునిలా ప్రాతిభాసితమవుతుందని, తత్త్వమసి అను జ్ఞానము కలిగిన పిదప అహమ్ బ్రహ్మాస్మి అను విషయము తెలిసి జీవుడే బ్రహ్మ అని అవగతమగునని చెప్పెదరు. రామానుజులు ఈ అవిద్య దేనిని ఆశ్రయించి ఉంటుంది అని ప్రశ్నిస్తారు. అంతకు ముందు లేని జీవుడిని ఆశ్రయించి ఉండలేదు. ఎందుకంటే అవిద్య ఆశ్రయించిన తరువాత నే కదా జీవుడు తయారయేది. లేదా బ్రహ్మను ఆశ్రయించి దానిని ఆచ్ఛదించింది అంటే చీకటి వెలుగును ఆశ్రయించి ఉండగలదా, స్వయంప్రకాశకమైన బ్రహ్మను ఆశ్రయించి అవిద్య ఎలా ఉంటుంది, అలాగయితే బ్రహ్మ, అవిద్య అని రెండు తత్త్వములు వచ్చి అద్వైతము కుదరదు కదా! నిర్విశేషమని మీరు చెప్పే బ్రహ్మ సవిశేషమై కూర్చుండును కదా! పోనీ అవిద్యనే బ్రహ్మ అందామంటే చీకటి వెలుగు అవలేదుకదా! .....అందుచే ఈ అవిద్య అస్తిత్వము గొడ్రాలు కొడుకు వలె నిరూపించ శక్యముకాదు. ఈ రకమైన వాదమును అనుపపత్తి అంటారు(ఆశ్రయానుపపత్తి).

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

# 4

వైష్ణవ సన్యాసులకు, మిగిలిన సన్యాసులకు మనకు కనపడే  ముఖ్యభేదములు దండ, యజ్ఞోపవీతాలు. (శిఖ కూడా ననుకోండి కాని అది వెనుక పక్కనుంటుంది కనుక కనపడక పోవచ్చు). అద్వైతులు వంటి సన్యాసులు ఏక దండులు. రామానుజ మత జీయర్లు త్రిదండ ధారులు. అటులనే కొంతమంది ఇతర సన్యాసులు యజ్ఞోపవీతాన్ని పరిత్యజిస్తారు. నిత్య కర్మాతీతులై జీవన్ముక్తావస్థ పొందే ప్రయత్నములో నుందుమని పల్కెదరు. కాని రామానుజ మత జీయర్లు యజ్ఞోపవీతాన్ని ధరించి సన్యాసాశ్రమ ధర్మముననుసరించి కర్మలననుష్ఠించుచుందురు. వీరికి యజ్ఞోపవీతముండును. కృష్ణ భగవానుడే భగవద్గీత యందు నహి "కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠతి అకర్మకృత్", అని క్షణము కూడ కర్మము చేయక యుండలేమని, "నియతమ్ కురు కర్మ త్వమ్", అని కర్మను నియమ బద్ధముగా చేయ వలెనని " న మే

పార్థాస్తి కర్తవ్యమ్ " నాకు చేయవలసినదేమియు లేకున్నను "యద్యదాచరతి శ్రేష్ఠః ..." అని శ్రేష్ఠులు ఎట్లు చేయుదురో తదితరులు ఆప్రకారంగా అనుసరించెదరు కనుక తాను కూడా కర్మ చేయుదునని చెప్పెను. అట్లయిన తక్కిన వారి గూర్చి చెప్పవలసిన దేమి. కర్మ మాని బ్రహ్మలమైతిమి అని కూర్చుండుట పలాయన వాదము, అవివేకము. వేదముల యందు కర్మకాండను సంపూర్ణముగా తృణీకరించి జ్ఞానకాండమును మాత్రమే పరిగణించు కొన్ని మతములు శ్రుతి విరుద్ధములు. రామానుజుల బ్రహ్మ సూత్రము వర్ణాశ్రమ ధర్మములను తృణీకరించగల అధికారము ఎవ్వరికినీ యుండదనీ తెలుపుతుంది. రామానుజులు తనకు వృద్ధాప్యము బాగుగా పెరిగి లేవలేని స్థితి లో నున్నపుడు గూడ సంధ్యావందనము యథాప్రకారము చేయుచు అర్ఘ్యమిచ్చుటకు లేవలేకున్నను శిష్య సహాయమున నిలబడియే అర్ఘ్య మిచ్చెడు వారట.

కనుక ముందు శ్లోకములలో త్రిదండమును వర్ణించి ఆ రామానుజుల యజ్ఞోపవీతమును వర్ణించుచున్నారు తరువాతి శ్లోకములో.

ఈ శ్లోకములలో నున్న అలంకారము ఉల్లేఖాలంకారమే కాక personification అను అలంకారము. ఇచ్చట త్రిదండము, బ్రహ్మ సూత్రము అని నప్పుడు దానిని ధరించిన రామానుజులు అని మనము గ్రహించాలి.

**శ్లో.**

**త్రయ్యా మాంగల్య సూత్రమ్ త్రియుగ యుగపదారోహణాలంబ సూత్రమ్**

**సద్విద్యా దీప సూత్రమ్ సగుణనయవిదామ్ సంపదామ్ హార సూత్రమ్**

**ప్రజ్ఞాసూత్రమ్ బుధానామ్ ప్రశమధనమనః పద్మినీ నాళసూత్రమ్**

**రక్షాసూత్రమ్ మునీనామ్ జయతి యతిపతేః వక్షసి బ్రహ్మ సూత్రమ్**

త్రయ్యా- వేదములకు

మాంగల్య సూత్రమ్- మాంగల్య సూత్రమును

త్రియుగ పదయుగ- షడ్గుణ పూర్ణుడైన భగవానుని పాద ద్వంద్వమును

(త్రియుగ యుగపద- 3*2*2=12 సోపానములున్న పరమపదమును)

ఆరోహణ ఆలంబ సూత్రమ్- అధిరోహించుటకు ఆలంబనమైన సూత్రము(త్రాడు)

సద్విద్యాదీప సూత్రమ్- భగవానుని పొందించు పరవిద్య ను చూపించు కరదీపిక

సకలకలి కథాసంహృతే- కలి పురుషుని వలన కలుగు సమస్త దుర్వ్యవహారములను సంహరించు

కాలసూత్రమ్- యమపాశము

(సగుణనయవిదామ్ -సద్గుణములు గలవారి జ్ఞానమనెడు

సంపదామ్ హార సూత్రమ్- ఐశ్వర్యహారమునకు ఆధారభూతమైన సూత్రము

బుధానామ్- సత్పురుషులకు, జ్ఞానులకు

ప్రజ్ఞాసూత్రమ్ - సుజ్ఞానము కల్గించి వ్యాప్తి చేయు సూత్రము

ప్రశమధనమనః - గొప్ప యోగీంద్రుల నియంత్రించ బడిన మనస్సు యనెడు

పద్మినీ నాళ సూత్రమ్- (రామానుజ దివాకరుల ప్రకాశముచే వికసించెడు) తామరపూవు జీవనమునకు కావలసిన నాళము( కాడ ) అనెడు సూత్రము

మునీనామ్- మునులకు, భక్తులకు

రక్షా సూత్రమ్- రక్షా బంధము

యతిపతేః- యతిరాజులైన రామానుజుల

వక్షసి- వక్షస్థలమునందు

జయతి- విరాజిల్లును గాక!

మాంగల్య సూత్రము స్త్రీకి భర్త యొక్క అస్తిత్వాన్ని తెలుపుతుంది. భర్త పోయినా, పెళ్ళి కాకపోయినా మాంగల్యము ఉండదు. భర్త చే మాంగల్యము కట్టించుకున్న భార్య ఆ భర్త కు వశవర్తియై అనన్య శేషత్వము, అనన్య భోగ్యత్వము, అనన్య రక్షకత్వము అను గుణములతో ప్రకాశిస్తుంది. అంటే ఆమె ఆ భర్త కే శేషభూతమై, ఆ భర్తకే భోగ్యమై, ఆ భర్త యందే రక్షణా భారము కలిగినదై ఉంటుంది. ఉదాహరణకు సీతమ్మ ఎట్టి ఇక్కట్లకు లోనయినా తనను రక్షించుకొన గలచినా తన భర్తకే ఆభారము అప్పచెప్పింది. ఆమెను మరల ఆమె భర్తతో కలవడానికి ఒక గొప్ప సత్పురుషుడు అయిన ఆచార్యుడు అవసరమయింది. ఈ ఆచార్యులకు ప్రతీకయే రామానుజుల యజ్ఞోపవీతము. రామానుజుల కాలమున లేదా వారి ముందుకాలమున కొందరు వేదములు అనాథ గా నాథుడే లేనట్లు, లేదా వ్యభిచారి అనగా అనేకములైన నాథులున్నట్లు, లేదా అసలు నాథుడను మరచి వేర్వేరు నాథులున్నట్లు ఇట్లు స్వకపోల

కల్పితములైన నాలోచనలతో భావించి ప్రవచించి ప్రచారము చేసిరి. అంతట ఆచార్య పురుషులైన భగవద్రామానుజులు వేదమాత అనాథ కాదనియు సర్వ రక్షకుడైన శ్రీమన్నారాయణుడే నాథుడనియు నిరూపించి వేదమాతకు గల శ్రీమన్నారాయణ సాంగత్యమును, సంబంధమును జగత్తునకు తెలియచెప్పిరి. వేదములను వివరించుటకు వేదాంతసూత్ర భాష్యమైన శ్రీభాష్యమే కాకుండా వేదార్థ సంగ్రహము, వేదాంత దీపిక, వేదార్థ సారము అనుగ్రంథములు అనుగ్రహించేరు. వేదములు స్తుతించునదియు,పరబ్రహ్మముగా ప్రతిపాదించునదియు శ్రీమన్నారాయణుడే అను విషయము మనకు అందించి మనలను ఉద్ధరించిరి. అందుచే ఆయన యజ్ఞోపవీతము వేదమాత మాంగల్యసూత్రము వలె వేదనాథుడిని నిరూపించును. ఇచట శ్రీమాన్ కూరత్తాళ్వాన్ తనియన్ యందు "యదుక్తయః త్రయీ కంఠే యాంతి మంగళ సూత్రతామ్ " అను శ్లోకము స్మర్యము.

భగవానునికి ఆఱుగుణాలుంటాయి. "జ్ఞాన శక్తి బలైశ్వర్య వీర్య తేజాంస్యశేషతః

భగవచ్ఛబ్ద వాచ్యాని వినాహెయైః గుణాదిభిః"-వి.పు. 6-5-79

అవి జ్ఞాన, శక్తి, బల, ఐశ్వర్య, వీర్య, తేజస్సులు. అట్టి భగవంతుని పాదయుగళమును చేరుటకు ఆలంబనమైన సూత్రము రామానుజుల యజ్ఞోపవీతము. రామానుజులు శరణాగతి గద్య యందు " ద్వయమర్థానుసంధానేన సహ సదైవమ్ వక్తా" అని అనుగ్రహించేరు. చివరి ఉపదేశములో కూడ ద్వయ మంత్రానుసంధానము అర్థము తో చేయుమని చెప్పేరు. ఆ రకంగా శ్రీమన్నారాయణ చరణద్వయమును మనము అందుకొనునట్లు మహోపకారము చేసేరు.

ఇంకొక రకంగా చూస్తే రామానుజాశ్రయణము అర్చిరాది మార్గారోహణము. అర్చిరాది మార్గమున 12 సోపానాలుంటాయి. వాటినే "ముక్తః అర్చిః దిన పూర్వపక్ష షడుదజ్ మాస అబ్ద వాత అంశుమత్ గ్లౌ విద్యుత్ వరుణ ఇంద్ర ధాతృ మహితః....శ్రీవైకుంఠమ్ ఉపేత్య" అని చెప్తారు. ఈ సోపానాల అధిరోహించుటకు కావలసిన సూత్రమే రామానుజుల బ్రహ్మ సూత్రము. వేదాంత దేశికులు " ఒక సింహము దుముకుతూ పర్వెత్తునపుడు సింహము శరీరమునంటి పెట్టకున్న చిన్న చిన్న కీటకాలు సింహము తో పాటే ప్రయాణిస్తాయి. అటులనే రామానుజులనాశ్రయిస్తే మనము కూడా ఆయనతో బాటు మనకు గమ్యము అయిన పరమపదము చేరవచ్చునని చెప్తారు.

"సత్ బ్రహ్మ నారాయణ ముఖ్య శబ్దైః సంకీర్తితమ్ జీవ జగచ్ఛరీరమ్

శ్రీమత్ సుకళ్యాణ గుణాకరమ్ తమ్

శ్రీశమ్ హ్యుపాసే నిఖిలైక హేతుమ్"

అనగా సత్, బ్రహ్మ, నారాయణాది శబ్దాలచే "వేదైః సర్వైః అహమేవ వేద్యః" అని భగవానుడే చెప్పినట్లు వేదములయందు ప్రఖ్యాపితమై జీవ, జగత్తులు శరీరముగా నుండిన కళ్యాణ గుణాకరుడు శ్రీశుడు. సత్ శబ్ద వాచ్యుడు శ్రీమన్నారాయణుడు. తచ్ఛరీరములైన జీవ జగత్తులు కూడ సత్పదార్థములే. అయదార్థములు గాదు. వేదాంత దేశికులు" మిథ్యాత్వస్య మిథ్యాత్వే మిథ్యాత్వమ్ బాధితమ్ భవేత్ సత్యత్వస్య సత్యత్వే సత్యత్వమ్ సాధితమ్ భవేత్ " అని అద్వైతుల మిథ్యా వాదమును ఈసడిస్తారు. అంటే బ్రహ్మ తప్ప మిగిలినదంతా మిథ్య అంటే మిథ్యాత్మమూ మిథ్యయే. ఈ రకంగా మిథ్యా వాదము బాధితమవుతుంది. అంటే తప్పని నిరూపించ పడుతుంది. అలా కాకుండా సత్యమని అంటే సత్యత్వమే సాధితమవుతుంది. " సన్మూలాః సౌమ్య ఇమాని ప్రజాః సత్ ఆయతనాః సత్ ప్రతిష్ఠాః" అని ఛాందోగ్యం చెబుతుంది. సత్పదార్థమైన పరబ్రహ్మము కారణము కాగా తదుత్పన్నములై తచ్ఛరీరములైన జీవ, ప్రకృతులు అయదార్థములెలా అవుతాయి. అందుచే సర్వమూ యదార్థమే. మనము (జీవులు) అయదార్థమే అయితే మరి ముముక్షుత్వముగాని, తత్ప్రయత్నముగాని మనకు వ్యర్థము గదా. ఈ విషయము తెలుపునదియే సద్విద్య. తెలిపినది భగవద్రామానుజులు. వారి బ్రహ్మ సూత్రము సద్విద్య ను చూపించు దీప సూత్రము. అంటే సద్విద్య అను దీపమునకు వత్తి వంటిది. వత్తి వలననే గదా దీపము, తత్ప్రకాశమూను.

రామానుజుల యజ్ఞోపవీతము కలి యొక్క అన్ని చాలనాలనూ నిర్మూలించే యమపాశము వంటిది.

రత్న హారమునకాధారము ఆ హారమునకుండు త్రాడు. సద్గుణ జ్ఞాన సంపదలకు ఆధారభూతమైన సూత్రము రామానుజ బ్రహ్మ సూత్రము. రామానుజ సిద్ధాంతమే లేకుండిన సద్గుణములన్నియు చెల్లాచెదురు అయి ఉండెడివి. జనము అరాచక, అక్రమాలతో దుష్ప్రవర్తకులై యుండెడివారు. రామానుజ సిద్ధాంతము అట్లుగాకుండ మనలనుద్ధరించినది.

సత్పురుషులు జ్ఞాన యోగులు, కర్మ యోగులు, భక్తి యోగులు అని మూడు విధములు. జ్ఞాన యోగులకు జ్ఞానము

కలుగుటకు గాని, ప్రతి ఫలాపేక్ష లేక కర్మను కర్తవ్యము నిర్వర్తించు కర్మయోగులకు వారి వ్యవహారములయందు గాని, కేవలము భగవానుని యందు అనురక్తితో ప్రవర్తించు భక్తి యోగులకు వారి భక్తి ప్రవర్తనలోగాని ఆధారభూతమైనదియు, వారి గమ్యమునకు ఉపాయమును, పరమ గమ్యమును భగవానుడే. అనగా జ్ఞాన యోగుల పరమ గమ్యమునకు ఉపాయము జ్ఞానము కాదు, కర్మ యోగులకు

కర్మమునూ కాదు, భక్తి యోగులకు భక్తియునూ కాదు. అందరకును పరమోపాయము ఆ పరబ్రహ్మమైన శ్రీమన్నారాయణుడే. మనమందరమూ ఈ సత్యమును తెలిసి ప్రవర్తించవలెను. రామానుజ సిద్ధాంతము మనకు పరమాత్మకు గల నవవిధ సంబంధములను తెలిపి, పరమాత్మయే బుధుల జ్ఞానమునకు జ్ఞేయమై, స్వామియై, శరీరియై, నిర్మల జన మనఃకమలాలకు తన్నాళములవలె ధారకమై, వాటికి సూర్యునివలె వలె భోక్తయై, విశేష్యమై, మని జనులకు రక్షకమై, శేషియై, భర్తయై ఉద్ధరించును అని తెలిపిన రామానుజుల బ్రహ్మ సూత్రము ఈ శ్లోకమునందు వర్ణించబడినది. అట్టి వారి (కి) యజ్ఞోపవీతమునకు జయమగుగాక

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

# 5

ఆచార్యుల ముఖ్య లక్షణములు ఈ శ్లోకములో తెలిపి భగవద్రామానుజులకు ఆ గుణములెట్లు ప్రకాశిస్తున్నాయో వివరిస్తున్నారు. ఆచార్యులు, దుర్జన సాంగత్య నిరసనము, అకుంఠిత భగవత్సాంగత్య కైంకర్యములు, ఆశ్రిత సన్మార్గ ప్రవర్తనము కలిగి తనవారిని ఉజ్జీవితులను చేయాలి. జగదాచార్యులైన భగవద్రామానుజుల ఈ విశేషములను వర్ణిస్తున్నారు.

**శ్లో.**

**పాషండ సాగర మహా బడబా ముఖాగ్నిః**

**శ్రీరంగరాజ చరణాంబుజ మూలదాసః**

**శ్రీవిష్ణు లోకమణి మండప మార్గదాయీ**

**రామానుజః విజయతే యతిరాజరాజః**

పాషండ సాగర- నాస్తికులనెడి సముద్రమునకు

మహా బడబా ముఖాగ్నిః- గొప్ప బడబాగ్ని

శ్రీరంగ రాజ- శ్రీరంగనాథుల

చరణాంబుజ- పాదపద్మముల

మూల దాసః- ప్రధాన కైంకర్య పరులు

శ్రీవిష్ణు లోక - నిత్యవిభూతిఅయిన శ్రీమన్నారాయణ పరవాసుదేవ రూప వాసమైన పరమపదమందలి

మణిమండప- మహా మణిమండపమునకు

మార్గదాయీ - మార్గమును ఇచ్చువాడైన(కృప చేయు)

యతిరాజ రాజు- యతిపతులకే నాయకుడైన

రామానుజః- రామానుజులు

విజయతే- విజయము పొందెదరు గాక.

ముందు ముళ్ళచెట్లన్నీ తొలగించిన తరువాతనే మంచి దారి వేయడం సంభవమవుతుంది. అటులనే లోకమునందలి నాస్తిక వాదములైన పాషండ, చార్వాక, బౌద్ధ, జైనాది వాదాలను నిర్మూలించిన తరువాతనే పరమపద గమన మార్గ వ్యవస్థాపనమవుతుంది. పై శ్లోకంలో పాషండ అంటే వేదాలను పూర్తిగా పరిగణించని మతాలన్నీ అన్నమాట. ఇవన్నీ సముద్రాల వంటివి. ఈ సముద్రములు మనలను ముంచెత్తకుండా కాపాడునది బడబాగ్ని. బడబ అను ఆడు గుఱ్ఱము ముఖమునుండి సముద్రము నందు వెలువడు ఈ అగ్ని సముద్రమును నియంత్రించుచుడునని పురాణ కథనము. అటులనే రామానుజులు నాస్తిక మతముల నియంత్రించిరి. అనగా ఉపాయ విరోధిని నిరసించిరి.

నాస్తిక మంత్ర నిరసనము పిదప కావలసినది భగవత్కైంకర్యము, సన్మార్గ ప్రవర్తనము. ఈ లోకమున ఈ పార్థివ దేహమున మనము పరమాత్ముని అర్చామూర్తిగ మాత్రమే దర్శించగలము. అందుచే మనము శరణాగతి చేయవలెనన్న మనము లక్ష్మీ సహితులైన భగవదర్చామూర్తి వద్దనే చేయుటయును, తత్పశ్చాత్ భగవత్కైంకర్యము భగవన్ముఖ వికాసమునకై చేయు చుండుటయు మన కర్తవ్యము. శ్రీరంగనాథుడు ప్రప్రథమ భగవదర్చామూర్తి. సాక్షాత్ శ్రీమన్నారాయణునిచే చతుర్ముఖ బ్రహ్మ కీయబడి సత్యలోకమున పూజలందిన తరువాత ఇక్ష్వాకు వంశ చక్రవర్తుల ఆరాధనలు పొంది శ్రీరామచంద్రమూర్తి విభీషణునకీయగా కారణాంతరములవలన మనకొఱకు శ్రీరంగమున ఉభయ కావేరుల మధ్య వేంచేసియున్న అర్చావతారము శ్రీరంగనాథుడు. ఆచార్యులనగా తాను స్వయముగా ప్రవర్తించి, తన వారికి దారి చూపి వారినుద్ధరించువారు. భగవద్రామానుజులు ఆది శేషాంశ. "నివాస శయ్య ఆసన పాదుక అంశుక ఉపధాన వర్షాతప వారణాదిభిః" అని యామునులు అనినట్లు పేరులోనే కాక ప్రతి చర్యలోనూ చలనం లోనూ నారాయణ శేషత్వము కలిగిన వారు ఆది శేషులు. త్రికరణ శుద్ధిగా పరమాత్మకు దాస్య భావన తన ప్రవర్తనలో చేసి చూపించిన వారు రామానుజులు. అనగా భగవంతుని పొందనుపాయము అందిచ్చిరి.

ఏతత్ఫలమేమి అనిన తెలుపుతున్నారు తరువాత పాదములో.

ఈ పార్థివ దేహత్యాగానంతరము అర్చిరాది మార్గమున ఈ లీలావిభూతి నధిగమించి, విరజను దాటిన పిదప పరమపదమును చేర్చి శ్రీమన్నారాయణుడు వేంచేసి యున్న మామణి (మహామణి) మంటప ప్రవేశార్హత కల్గించి భగవద్రామానుజులు మనకు పరమపదమును అందిచ్చును. ఆ శ్రీరంగ నాథుడే రామానుజులకు"ఉభయ విభూతి నాథునిగా(ఉడయవర్)" బిరుదమిడి రామానుజులే నిత్య విభూతికి ప్రవేశార్హత కల్గించగలవారని నిర్ణయించేరు కదా!

అప్రాకృతమైన తేనెలూరు కల్పవృక్షాలతో, ఫల, పుష్పములతో, మణి, రత్నములతో అమర్చబడిన లీలామండపాలతో, శుక,శారికా మయూరాది పక్షి నినదమ్ములతో, అమృత వాహినులతో, దివ్యోద్యానాలతో, అసంఖ్యాక మణిమయ స్తంభాలతో, దివ్య గంధములతో అప్రాకృత దివ్య భవనములతో నలరారు అపరాజిత అనెడు వైకుంఠమున మహా మణి మండపమున పన్నెండు రేకులతో నానా శక్తిమయమైన దివ్యకమలమధ్యమున దివ్య కర్ణిక యందు పుష్ప సంచయంతో దివ్యయోగపర్యంకుడై అనంత, గరుడ, విష్వక్సేనాదులు కొలుచుచుండ శ్రీ, భూ,నీళా సమేతుడై దివ్యశరీర ధారియై, వనమాలాధరుడై, శంఖ, చక్ర, గదాది ఆయుధ హస్తుడై, దివ్య కౌస్తుభధరుడై, సహస్రానీక నిత్య,ముక్తాది సేవితుడై, శత సహస్రానీక భాను సమాన తేజఃపుంజము వలె ప్రకాశించు చున్న శ్రీమన్నారాయణుని కటాక్ష వీక్షణములకు పాత్రునిగా మనలను చేయువారు భగవద్రామానుజులు. వారు విజయము పొందెదరు గాక.

భగవద్రామానుజులు విజయము పొందడం అంటే ఏమిటి! వారి అవతార ప్రయోజనము ధర్మ సంస్థాపనము, సామాన్య జనోద్ధరణము. అంటే మనవంటి సామాన్యులు ఉద్ధరింపబడడమే ఆయనకు విజయము . కృష్ణ భగవానుడు తన అవతార రహస్యము తెలుపుతూ సాధు జన పరిత్రాణము కొఱకు తానవతరించుతానన్నాడు. అంటే మన వంటి సామాన్యులకు రామానుజులు తప్ప మఱి దిక్కు వేఱొకటి లేదన్న మాట.

శ్రీమాన్ మధుర కవి ఆళ్వార్ స్వామి నమ్మాళ్వార్ పై రచించిన కణ్ణి నుణ్ శిరుత్తాంబు వలె శ్రీమాన్ ముదలి ఆండాన్ స్వామి భగవద్రామానుజుల పై రచించిన ఈ ధాటీ పంచకము కూడ కేవల ఆచార్య వైభవమును చాటిచెప్పెడు గ్రంథము. మన సంప్రదాయమున "భగవల్లాభమ్ ఆచార్యనాలే" అని పిళ్ళై లోకాచార్యస్వామి శ్రీవచనభూషణమున కృప చేసినట్లు భగవానుని పొందవలెనన్న ఆచార్య సమాశ్రయణము తప్పనిసరి. మన ఆచార్యులకందరకూ భగవద్రామానుజులు మూలము. వారి పాదుకా సమానులైన శ్రీమాన్ ముదలిఆండాన్ మనలనుద్ధరింప మనకు ఈ చిన్ని గ్రంథమును కృప చేసిరి.

శ్రీమన్ముదలియాండాన్ తిరువడిగళే శరణమ్

రామానుజ తిరువడిగళే శరణమ్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వామి ముదలి ఆండాన్ భగవద్రామానుజులకు త్రిదండ సమానులు అని అనుకున్నాము కదా! అందుచేతనే మిగిలిన దేహ బంధువులను గాని, బాంధవ్యాలు గాని పూర్తిగా విడచి పెట్టినప్పటికీ ముదలిఆండాన్ మాత్రము రామానుజులను ఎప్పుడూ వెన్నంటే ఉండేవారు. ఒక సారి వడుగ నంబి ఇంటికి సమాశ్రయణము కాని కొంతమంది అతిథులు వచ్చేరట. వారికి అతిథి సత్కారములైన పిమ్మట సమాశ్రయణము కాని వారికుపయోగపడిన పాత్రలను పరిత్యజించి తత్పాపపరిహారంగా రామానుజుల పాదుకా సదృశులైన ముదలి ఆండాన్ స్వామి వారు వాడిన పాత్రలను తరువాత ఉపయోగించిరట.

ముదలి ఆండాన్ శిష్యుల యందు ఒకరు ఎంబార్ వద్ద శిష్యరికమునకు చేరుకొండిరట. తరువాత ఎంబార్ కు ఆవిషయము తెలిసి ముదలి ఆండాన్ కడకేగి సాష్టాంగప్రణామము చేసి తాను తెలియక ముదలి ఆండాన్ శిష్యుని స్వీకరించితినని మన్నించమని వేడుకొనిరట. అంతట ముదలిఆండాన్ స్వామి దానికెంత మాత్రమూ నొచ్చుకొనక నూతిలో పడిన వానికి ఇరువురునూ చేయి నందిచ్చిన ఇంకనూ సులభముగా వాడు రాగలవాడు కదా అని పలికిరట. అట్టి సౌలభ్యము కలవారు స్వామి ముదలిఆండాన్.

ముదలి ఆండాన్ కు చాల కాలము సంతానము కలుగ లేదు. ఆ విషయము వారును, వారి ధర్మపత్నియు రామానుజులకు విన్నవించు కొనుచుండగ, ఆ సమయమున శ్రీరంగనాథుని ప్రసాదము వచ్చిందట. ఆ ప్రసాదం బుట్టపై తప్పినట్లు వస్త్రము స్వామి వారికి ఉపయోగించి జీర్ణమైన వస్త్ర భాగము. కస్తూరి రంగనికి కప్పిన వస్త్రము కావడం వలన దానికి ప్రత్యేకమైన సుగంధము వచ్చింది. రామానుజులు ముదలి ఆండాన్ కు ఆ వస్త్రమునిచ్చి ఆశీర్వదించేరట. తత్ప్రసాదంగా ముదలి ఆండాన్ దంపతులకు పుత్ర సంతానము కలిగింది. వారికి రామానుజులు "ఇళయాళ్వార్ రామానుజుల" ని పేరిడిరి. వీరే తరువాత కాలమున కందాడై ఆండాన్ (గంద- సుగంధ భరితమైన అడై- వస్త్ర ప్రసాదము వలన జన్మించిన ) అని పేరు పొంది రామానుజులు స్థాపించిన 74 సంహాసనాధిపతులలో నొకరిగా మన రామానుజ సంప్రదాయమునకు అనేక స్వలందిచ్చిరి.

శ్రీరంగమునందు నంబెరమాళ్ళు(శ్రీరంగనాథుని ఉత్సవ మూర్తి) తిరువీధికి వెడలి తిరిగి వచ్చినప్పుడు వారికి దృష్టి తీసి ఎంబార్, ముదలిఆండాన్ లు ఒకరినొకరు కౌగలించుకొని లోకుల చూపుల బారి నుండి క్షేమంగా మన పెరుమాళ్ళు తిరిగి వచ్చేరని సంతసించు చుండెడి వారట.

చోళరాజు క్రిమి కంఠుడు మరణించిన తరువాత వాని కుమారుడు రామానుజుల వద్దకు వచ్చి తన తండ్రి తప్పిదములకు తనను క్షమించమని కోరెను. అంతట రామానుజులు చోళరాజపుత్రునకు ముదలి ఆండాన్ వద్ద శరణాగతి చేసి తిరుపతి, శ్రీరంగ క్షేత్రముల బాధ్యత స్వీకరించుమని తెల్పిరి. ఆ సందర్భమున ముదలి ఆండాన్ కు చెంచు లక్ష్మీ సమేత అహోబిల నారసింహులను ప్రసాదించిరి.

ఒకసారి ముదలి ఆండాన్ తిరుతంగాళ్ పెరుమాళ్ళ శ్రీవిల్లి పుత్తూరు గరుడ సేవ సేవించుకొనగ మల్లి గ్రామమునకు వేంచేసిరి. అప్పుడు ఆయన వద్దకు ఒక వైష్ణవుడు వచ్చి తనకు మిక్కిలి ఆకలిగా నున్నదనియు, తినుటకు ఏదయిననూ ఈయుమనియు కోరెను. ముదలి ఆండాన్ భోజనమును తెచ్చుసరికి ఆ వైష్ణవుని స్థానమునందు తిరుతంగాళ్ అప్పన్ వేంచేసి యుండిరట. అంతట ఆ పెరుమాళ్ళే వైష్ణవ రూపమున వచ్చి దర్శనమిచ్చిరని తెలిసిన ముదలి ఆండాన్ ఆ పెరుమాళ్ళకు ఆ భోజన పదార్థములను ఆరగింపు చేసిరట. మల్లి గ్రామమున ఈనాటికిని గరుడ సేవ దినమున ముదలి ఆండాన్ సమర్పించినట్లు ప్రసాద సమర్పణము చేయుదురు.

ముదలి ఆండాన్ స్వామి భగవద్రామానుజుల ప్రథమ శిష్యులు. భగవద్రామానుజుల ఆదేశమున శ్రీరంగ క్షేత్రమున అనేక సేవలొనరించినవారు. తన 105 వ ఏట అనగా క్రీ.శ. 1132 సంవత్సరమున ( విరోధికృత్ నామ వత్సరమున) స్వామి ఆచార్య తిరువడి చేరిరి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రామానుజుల ముఖ్య శిష్యులయిన ముదలి ఆండాన్ స్వామి వర పుత్రరత్నము కందాడై ఆండాన్. ఈ కందాడై వంశమే కందాడయ్యర్ వంశమని తరువాతి కాలంలో ప్రసిద్ధి చెందింది. శ్రీవిల్లి పుత్తూరులో ఉత్తర మాడ వీధిని కందాడయ్యర్ వీధి అని ఇప్పటికీ పిలుస్తారట.

కందాడై ఆండాన్ శ్రీరంగమునందు కుంభమాసమునందు పునర్వసు నక్షత్రమున శత్రుఘ్నాంశమున జన్మించేరు. శ్రీరంగము పేరుతో వీరి వంశానికి శ్రీమత్ కోయిల్ అని పేరు వచ్చింది. శ్రీరంగమున సప్త ప్రాకారాలలో కోవెల మనుష్యులకు తప్ప మిగిలిన వారికి ఇళ్ళు ఉండే ఆచారము లేదు. కాని భగవద్రామానుజులు ఏడవ ప్రాకారమునందే ఆండాన్, కూరేశులకు పెరియనంబి గారికి నివాస గృహములనేర్పాటు చేసిరి. నమ్మాళ్వార్ సన్నిధి యందు మధురకవి, నాథమునులవలె రామానుజుల సన్నిధి యందు ముదలి ఆండాన్, కూరేశులను చూడవచ్చును.

కందాడై ఆండాన్ తన తండ్రి గారయిన ముదలి ఆండాన్ వద్ద శ్రీ భాష్య వేద శాస్త్రాలు, ద్రావిడ గ్రంథాలు, అధ్యయనము చేసేరు. రహస్యార్థములను అట్కొండ విల్లి జీయర్ స్వామి వద్దను, మిగిలిన శాస్త్ర విషయాలను భగవద్రామానుజుల వద్దనూ నేర్చు కున్నారు. రామానుజుల యందు గల భక్తి, ప్రపత్తుల

వలన రామానుజుల అర్చామూర్తిని శ్రీపెరుంబూదూరు నందు ప్రతిష్ఠించుటకు శ్రీమాన్ కందాడై ఆండాన్ రామానుజులను ప్రార్థించగా రామానుజుల అందుకు అంగీకరించిరట. రామానుజులు ఆండాన్ నందు గల వాత్సల్యముతో ఆండాన్ తయారు చేయించిన అర్చామూర్తిని కౌగలించుకొని దానిని ప్రతిష్ఠించుటకు నిర్దేశించగా ఆ మూర్తిని ఫంగుని మాసమున పుష్య నక్షత్రమున శ్రీపెరుంబూదూరు న శ్రీమాన్ ఆండాన్ ప్రతిష్ఠించిరి. అచ్చట పూజా విధి, విధానమును నిర్దేశించి అమలుపరచిరి. ఆ సమయమున రామానుజులకు తన శక్తి తగ్గినట్లు తోచినదట. అటులనే పిమ్మట రామానుజులు ఆండాన్ ను పిలిపించి శ్రీరంగము కార్యక్రమములన్నింటిని ఆండాన్ కు అప్పగించిరి. రామానుజులు పరమపదము చేరిన పిదప ఆయన పార్థివదేహమును నంబెరుమాళ్ళ నిర్దేశమున రంగనాథుని వసంతమండపమువద్ద(కోవెలలోపుననే) ప్రతిష్ఠించి ఉత్సవ మూర్తి ప్రతిష్ఠాపనముకూడ గావించి ఆరాధనా విధానాదులనేర్పాటు చేసిరి.

కందాడై తోఝప్పర్ కందాడై ఆండాన్ కుమారులు.

రామానుజార్య సత్పుత్రమ్ వారణాధీశ దేశికమ్
లోకాచార్య కృపాపాత్రమ్ వందే గుణగణార్ణవమ్

వీరినే వారణాధీశులనియు, శ్యామ హస్తీశులనియు కూడ పిలిచెదరు. వీరికి ఆచార్యులు తండ్రి గారయిన కందాడై ఆండాన్. వరదరాజ పెరుమాళ్ళకు వీరు అత్యంత సన్నిహితులగుటచే వీరికి తోఝప్పర్ అని నామమేర్పడినది. గజారోహణాది మర్యాదలు పొంది వారణాధీశులని ఖ్యాతి గాంచిరి. వీరు ఆండాళ్ మూర్తిని కాంచీపురమునందు వరదరాజ కోవెలలో ప్రతిష్ఠంచి కళ్యాణోత్సవము జరిపించిరి. అనుదినము తీర్థ కైంకర్యము చేయుచుండెడువారు. అంతట వరదరాజులు వారికి "అఝైతు వాఝ్వితవు" లను (వరదరాజుల ఆఱు ఉత్సవమూర్తులలో ఒకరు) తిరువారాధన పెరుమాళ్ళుగా ప్రసాదించిరి. ముదలి ఆండాన్ తిరు మార్గ యందు ఈనాటికిని ఈ మూర్తికి తిరువారాధన జరుగుచుండును.

కందాడై తోఝప్పర్ ఒకమారు నంబిళ్ళగారితో ఏదో ఒక విషయమున వివాదము కలిగి పరుషముగా మాటలాడిరట. ఆరోజు రాత్రి తన తప్పిదమునకు విచారించి క్షమాపణ కోరుటకు నంబిళ్ళగారి వద్దకు బయలుదేరిరి. తలుపు తెరవగనే సాష్టాంగప్రణామము సమర్పించుచున్న నంబిళ్ళగారిని చూచి ఆశ్చర్య చకితులైనారు తోఝప్పర్. ముదలి ఆండాన్ వంశస్థులను కష్టపెట్టనందుకు క్షమాపణ కోరగా నరుదెంచి వారు నంబిళ్ళగారు. అంతట తోఝప్పర్ నంబళ్ళగారిని లోకాచార్యులని పిలుచుచూ అత్యంత అభిమాన గౌరవములతో ఆయన పాదముల పడిరట.

తోఝప్పర్ శ్రీరంగనాథుని కైంకర్యములు సమర్పించుచున్న కాలమున వారి కుమారులు పెరుమాళ్ళకు పాలు ఆరగింపునకు సమర్పించిరట. ఆ పాలలో కేశమొక్కటి చూచి, అది గొంతు కడ్డుపడి పెరుమాళ్ళకు ఏమి హాని కలిగినదో యని వారిరువురు మూర్ఛ పోయిరి. వారికి భగవానుని యందుగల ప్రేమకు కరిగి పెరుమాళ్ళు వారిని "పెరియాయి", "చిరియాయి" (ఆయి అనగా అమ్మ) పిలుచుచుండెడివారట.

వీరే పెద్ద వరదాచార్, చిన్న వరదాచార్.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కందాడై తోఝప్పర్ కు పెద్ద వరదాచార్యులు, చిన్న వరదాచార్యులే కాక ఈయన్ రామానుజులను ఇంకొక కుమారులున్నారు. ఇంకొక కుమారుల పేరు దేవరాజ అమ్మాళ్. చోళరాజు దుష్ప్రవర్తనవలన పెద్ద వరదాచార్యులు తిరుమఝిశై కు మిగిలిన కుమారులతో తోఝప్పర్ కాంచీపురమునకు వెళ్ళవలసి వచ్చినది. పెద్ద వరదాచార్యులను తిరుమఝిశై ఆళ్వార్ "తిరుమఝిశై కందాడయ్యర్" అని పిలిచెడువారట వారట. వారి వంశీకులు ఈనాటికినీ అదే పేరుతో తిరమఝిశై యందు పిలువబడుచుందురు.

కాంచీపురమునందు నివసించుచున్న తోఝప్పర్ కు దేవరాజ పెరుమాళ్ కలలో కనపడి నీకుమారుడైన ఈయన్ రామానుజుల వలన నీవు మరల శ్రీరంగనాథుని కైంకర్యము చేయగలవని వాక్రుచ్చెనట. పిదప ఆ చోళరాజు తన తప్పిదముల వలన దుఃఖములననుభవించి మరణించెను. వాని కుమారుడు ముత్తు కృష్ణ చోళునికి శ్రీరంగనాథుడు కలలో కనపడి నా కైంకర్యమునకు నీవు ఈయన్ రామానుజులను పిలిపింపుము అని నిర్దేశించెను. చోళరాజు ప్రార్థించిన పిదప తోఝప్పర్ తన కుమారులతో కాంచీపురమునుండి శ్రీరంగమునకు ఏతెంచెను. ఆనాటినుండి ఈయన్ రామానుజులు శ్రీరంగ క్షేత్రమునకు సమస్త కైంకర్యములు చేయుచుండెడువారు. జీర్ణ దశలోనున్న  అనేక గోపురములను, ప్రాకారములను మరల కట్టించి భగవత్కైంకర్య విధానములను సరిదిద్ది ముదలిఆండాన్ కాలమునాటి పూర్వ వైభవము కలుగునట్లు చేసిరి. అందుచే వారికి వాధూల దేశికులని పేరు కలిగినది.

ఈయన్ రామానుజుల కుమారులు దేవ పెరుమాళ్ పిళ్ళై, తిరుక్కోప్పురత్తు నాయనార్. తిరుక్కోప్పురత్తు నాయనార్ కమారులు పెరియ అన్నన్, శిరియ అన్నన్, దేవ పెరుమాళ్ తోఝప్పర్. దేవ పెరుమాళ్ తోఝప్పర్ కుమారులు పరేలి నాయనార్, అలైత్త వల్వట్ట పెరుమాళ్, పెరియ జీయర్ తిరువడిగళ్ అన్నన్, కోయిల్ కందాడై అప్పన్.

వీరి యందు అన్నన్, అప్పన్ మణవాళమాముని స్వామి వద్ద ఆయనకు అత్యంత సన్నిహితులై యుండెడివారు. మణవాళ మహాముునుల పూర్వదిన చర్య గ్రంథమునందు ఎఱుంబి అప్పా అనెడు మణవాళ మహాముునుల మరియొక శిష్యులు( వీరికే శ్రీదేవరాజ గురువులని ఇంకొక పేరు)

పార్శ్వతః పాణి పాదభ్యామ్ పరిగృహ్య భవత్ప్రియా

విన్యస్యన్తమ్ శనైః అంఘ్రీ మృదులౌ మేదినీతలే

( దేవరవారు అనగా మణవాళ మహాముునులు తమరి ఇరు ప్రక్కల తమరి ప్రియాతి ప్రియమైన అన్నన్, అప్పన్ లను తమ పాణి పద్మాలతో గట్టిగా పట్టుకొని తమ మృదుపైన పాదములతో నేలపై నడచెదరు)

అని కీర్తిస్తారు. ఈ సంఘటన మనకు భగవద్రామానుజులు ముదలిఆండాన్ భుజములపై చేతులుంచి కావేరికి వెళ్ళు ఘట్టము గుర్తుకు తెస్తుంది. మణవాళ మహాముునులు భగవద్రామానుజుల అంటే ఆది శేషుల అవతారము.వారు ఆది శేషుల రూపము దాల్చి సేవ సాయించిన స్థలము మనము ఈ నాటికి మణవాళ మహాముునుల సన్నిధిలో శ్రీరంగమున చూడగలము. మణవాళ మహాముునులు భగవద్విషయము కాలక్షేపము శ్రీరంగ క్షేత్రమున మండపమునందు అనుగ్రహించినప్పుడు ఆ శ్రీరంగనాథుడే చిన్న పిల్లవాని రూపమున వచ్చి "శ్రీశైలేశ దయాపాత్రమ్ ....అని మనము అనుదినము చదివెడు మణవాళ మహాముునుల తనియన్ ప్రసాదించేడు. భగవద్రామానుజుల తరువాత విశిష్టాద్వైత సంప్రదాయాన్ని  మళ్ళీ అంత గొప్పదనము పొందునట్లు చేసినవారు మణవాళ మహాముునులయితే వారికి ముదలి ఆండాన్, కూరేశుల వలె వీరికి చేదోడు, వాదోడుగా నున్న వారు అన్నన్, అప్పన్ సోదరులు. అన్నన్ కు మణవాళమహాముునులు ఆచార్యులయితే అప్పన్ కు అన్నన్ యే ఆచార్యులు. అన్నన్ కు తల్లి, తండ్రులు పెట్టిన పేరు వరద నారాయణన్. వీరు మహా పండితులై అనేకమంది శిష్యులతో శ్రీరంగమున వేంచేసి యుండిరి. ఆ సమయమున మణవాళ మహాముునులు శ్రీరంగమునకు వేంచేసిరి. శ్రీరంగనాథుడు మణవాళ మహాముునులను ఆదరముతో ఆహ్వానించిరట. మణవాళ మహాముునులు సన్న్యాసాశ్రమ స్వీకారము చేసి అఝగియ మణవాళ్ మహాముని అను పేరు రంగనాథుని పనుపున స్వీకరించిరి.( పూర్వాశ్రమమున వారి పేరు అఝగియ మణవాళ పెరుమాళ్ నాయనార్. వీరు శ్రీశైలేశుల శిష్యులు). రంగనాథుడే తన ఇష్టమైన తన పేరు వీరికి ఉంచేడట. (అఝగియ మణవాళ పెరుమాళ్ అనునది రంగనాథుని పేరు). శ్రీరంగనాథుడు వారిని పల్లవరాయ మఠమునందు నివసించుటకు నిర్దేశించిరి. పల్లవరాయ మఠము రామానుజుల కాలమునుండి ప్రసిద్ధి చెందిన మఠము. ఆ మఠమునందు అనుదినము శిష్యులకు కాలక్షేపములు అనుగ్రహించుటకు వారు వీలుగా విశాలమైన స్థలమును పెన్నడిక్కాళ్ జీయర్ మొదలైన శిష్యులచే నేర్పాటు చేసికొనిరి. ఆ స్థల నిర్మాణమునకు పిళ్ళై

లేకాచార్యుల (జీర్ణావస్థలో నున్న ) నివాసభవనమునుండి మట్టి తెప్పించిరట. మణవాళ మహామునులు పరమత పాలకుల వలన కలగుండు పడిన మన సంప్రదాయాన్ని పునరుద్ధరించి సత్సంప్రదాయ స్థాపన చేసేరు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కోయిల్ కందాడై అన్నన్ మణవాళమహామునులనాశ్రయించడానికి కారణమైన ఐతిహ్యామొకటి యున్నది. ఆచ్చి అమ్మ కందాడై శిత్తనూర్ వారి భార్య. ఆమె తిరుమంజనమ్ అప్పా అనువారి కుమార్తె. తిరుమంజనమ్ అప్పా మణవాళ మహామునులకు గొప్ప శిష్యుడు. ఆ కారణంగా ఆచ్చి అమ్మ కూడా మణవాళ మహామునులను తనను శిష్యురాలుగా చేసికొనమని చాల ప్రార్థించినది. మొదట ఇష్టము లేకున్నను ఆమె అవిరళ భక్తి, ప్రపత్తులకు శ్రద్ధాసక్తులకు చాలా ఆనందించి మణవాళ మహామునులు ఆమెను శిష్యురాలుగా స్వీకరించేరు. ఆమె ఈ విషయము ఎవ్వరికిని, చివరకు, తన భర్త అయిన కందాడై శిత్తనూర్ కు కూడా తెలుపలేదు( ఆ రోజులలో స్రీలు అందులో కందాడై వంశపు కోడలు వేరొక ఆచార్యులను ఆశ్రయించడం చాలా అసహజమైన అనంగీకారమైన విషయము). ఒక సారి కోయిల్ కందాడై అన్నన్ తండ్రి గారి శ్రాద్ధము జరుపవలసి వచ్చినది. అందుకు ఆచ్చి అమ్మ సహాయము కోరగా ఆమె శ్రాద్ధ కైంకర్యమును అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వర్తించినది. శ్రాద్ధ కార్యక్రమము పూర్తి అయిన పిమ్మట బడలికతో అందరూ అరుగుపై విశ్రాంతి తీసికొను చున్నారు. ఆ సమయమున అన్నన్ ఒక శ్రీవైష్ణవుడు పెరియ జీయర్(మణవాళ మహామునులు) మఠమునుండి వచ్చు చున్నట్లు చూచెను. అన్నన్ వానిని వివరములడుగగా నాతడు తన పేరు సింగరయ్య అని నుడివెను. తాను వల్లువ రాజేంద్రమను సమీప గ్రామమునుండి వచ్చుచున్నానని, మణవాళ మహామునుల శిష్యుడగుటకు ఆకాంక్షిస్తున్నాని తెలిపెనట. అన్నన్ ఇంతమంది ఆచార్య స్వాములుండగా పెరియ జీయర్ వద్దకే ఎందుకని ప్రశ్నించగా నాతడు సాక్షాత్తూ భగవంతుడే ఆయనకు శిష్యుడయినప్పుడు మిగిలిన వాళ్ళు కోరుకొనుటలో విశేషమేమున్నదని పలికెనట. అన్నన్ ఆశ్చర్యపడి అది ఎట్లు అనిన ఆ వైష్ణవుడు అది పరమ రహస్యము అని చెప్పుటకు ఒప్పుకొన లేదు. అన్నన్ ఆ వైష్ణవుని లోపలకు పిలచి ప్రసాద, తాంబూలములనిచ్చి అచ్చటనే విశ్రాంతి తీసుకొనమని చెప్పిరి. అందరు పండుకొను సమయమున ఆచ్చి అమ్మ జీయర్ తిరువడి గళే శరణమ్, పిళ్ళై తిరువడి గళే శరణమ్, వాఝి ఉలగాశిరియన్ తిరువడిగళే శరణమ్ అని పలికినదట. ( అనగా పెరియ జీయర్, వారి ఆచార్యులైన తిరువాయ్ మొఝిప్పిళ్ళై, వారి ఆచార్యులు అష్టాదశ రహస్య గ్రంథ కర్త పిళ్ళై లోకాచార్యులకు మంగళాశాసనములు). అన్నన్ సోదరులకు ఈ విషయము అర్ధము కాలేదు. కాని మరునాడు తీరికగా అడుగ వచ్చునని నిద్రించిరి. కాని అన్నన్ కు పెరియ జీయర్ విషయమింకను మనసులో దొలుచుచున్నది. ఆయన మళ్ళీ సింగరయ్య వద్దకు పోయి

పెరియ జీయర్ వృత్తాంతమును తెలుపమని కోరిరి. సింగరయ్య అన్నన్ కు తన కథ అంతట వివరించెను. ఆతడు కూరగాయలను వివిధ మఠములకు ఇచ్చు చుండెడివాడు. ఒక సారి ఒక శ్రీవైష్ణవుడు ఆ కూరగాయలను పెరియ జీయర్ మఠమునకిమ్మని చెప్పెను. వాడు పెరియ జీయర్మఠమునకు ఆ కూరగాయలనీయ బోవగా జీయర్ అందుకంగీకరించక ఆ కూరగాయలెక్కడ పండించినవి, ఎవరు పండించినవి, ఎట్టి నీరు వాడబడినది అనుచూ అనేక ప్రశ్నలు వేసి ఆ కూరగాయలు తన శిష్యులైన శ్రీవైష్ణవులే శుద్ధ సత్త్వ ప్రవర్తనముతో పండించినవని తెలిసిన తరువాత అంగీకరించిరి. అంతేకాక ఆ కూరగాయలను రంగనాథులకు కూడా అర్పించమని చెప్పిరి. ఆతడు అర్చక స్వామివద్దకు పోయి ఆ కూరగాయలు ఇచ్చునపుడు అర్చక స్వామి ఎవరెవరికి ఈ కాయగూరలనిచ్చు చున్నావని అడుగగా పెరియ జీయర్ మఠమునకిచ్చుచున్నాని ఆ సింగరయ్య తెలిపెను. అంతట నా అర్చకులు పెరియ జీయర్ తో ఏదో రకముగా సంబంధము కలిగి యుండుట చాల అదృష్టము, ముక్తి ప్రదాకయము అని తెలిపిరి. తిరిగి వెళుతున్నప్పుడు పెరియ జీయర్ మఠములో ప్రసాదము స్వీకరించిన నాతనికి చాల శాంతి, ప్రసాదములు కలిగెను. ఆ రోజు రాత్రి రంగనాథుడే వానికి కలలో కనపడి తన ప్రక్క నున్న ఆదిశేషుని చూపించుచూ ఈ ఆది శేషుడే పెరియ జీయరనియు, వారిని సేవించిన మోక్షము తప్పదనియు అనుగ్రహించిరి. ఆనాటి నుండి వారి శిష్యులగుటకు తాను ప్రయత్నించు చున్నానని ఆ సింగరయ్య పలికేడు.

ఈ విషయమై ఆలోచించుచూ అన్నన్ నిదురించిరి. కలలో ఒక వైష్ణవుడు మేడ మీద నుండి దిగి వచ్చి అన్నన్ ను తనవద్దనున్న దండముతో తీవ్రముగా కొట్టసాగెను. ఆ దండము విరిగిన తరువాత ఆ శ్రీవైష్ణవుడు అన్నన్ ను తనతో లాగుకొనిపోయి అచట ఒక సన్యాసి వద్దకు తీసుకొని పోయెను. ఆ సన్యాసి కూడ మిక్కిలి కోపించిన వాడై తన దండముతో అన్నన్ ను ఆ దండము విరుగు వరకు కొట్టసాగెను. అప్పుడు ఆ శ్రీవైష్ణవుడు ఆ సన్యాసిని " అన్నన్ కు బాల్యత్వము ఇంకా వదల లేదు. తనకు తనేమి చేస్తున్నాడో తెలియదు. దయచేసి వానిని క్షమించవలెను" అని ప్రార్థించెను. అంతట ఆ సన్యాసి అన్నన్ ను ఆప్యాయతతో తొడపై కూర్చుండ పెట్టుకొని తల నిమురుతూ "మీరు చాలా పెద్ద దోషము చేస్తున్నారు. " అని పలికేరు. అన్నన్ "నాకు పెరియ జీయర్ గొప్పదనము తెలియదు. అందుకే నేను ఆయనను గుర్తించ లేకపోయినాను. నన్ను క్షమించుడు" అనిపలికేరు. అంతట ఆ సన్యాసి నేను రామానుజుడను. ఈ వైష్ణవుడు మీ వంశ శిరోమణి ముదలి ఆండాన్. ముదలి ఆండాన్ వంశములో పుట్టి ఆయన పేరుకు మచ్చ తేకండి. ముదలి ఆండాన్ సంబంధము అత్యంత అదృష్టము. ఆ సంబంధమును వమ్ము చేసుకొనవద్దు. ముదలి ఆండాన్ పై నాకున్న అభిమానంతో నేను నీకు చెప్పడానికి వచ్చేను. మణవాళ మహాములు నా అంశతో జన్మించిన వారు. సాక్షాత్తూ రంగనాథులే ఆయనకు శిష్యులు. ఆ అవకాశాన్ని వదులుకోవద్దు. . ప్రపంచాన్ని ఉద్ధరించడానికి, నేను పూర్తి చేయని పనులను పూర్తి చేయడానికి అవతరించినవారు వారు. వారి దగ్గర శిష్యులుగా చేరి ఉద్ధరించ బడండి " అని నిర్దేశించేరు.

అంతట ఆ కలలోంచి మేల్కొని సంభ్రమాశ్చర్యాలతో అన్నన్ ఆ స్వప్న విశేషాలను తన సోదరులకు వివరించేరు. ఈ విషయము ఆచ్చి అమ్మకు కూడ తెలుపగా ఆమె పెరియ జీయర్ గొప్పదనాన్ని తనకు ఆయనవలన కలిగిన ఉజ్జీవనాన్ని తెలిపింది.

మరునాడు కందాడై బంధు వర్గమంతా కలసి ఈ విషయము చర్చించుకున్నారు. ఆశ్చర్య కరంగా అందరికీ ఒకే రకమైన కల వచ్చింది. వారందరూ ఎంబా ( ప్రసిద్ధులైన ఆచార్యులు లక్ష్మణాచార్యుల మనుమడు) వద్దకు వెళ్ళి ఈ విషయము విన్నవించేరు. ఎంబా చాలా కోపగించుకొని వేఱొక ఆచార్యుల వద్దకు కందాడై కుటుంబము ఎలా ఆశ్రయిస్తుంది అని తన అంగీకారమీయలేదు. అయినను కందాడై అన్నన్ చాల మంది కందాడై కుటుంబ సభ్యులతో కావేరీ నదికి పోయి స్నానము చేసి పెరియ జీయర్ వద్దకు పోయి ఆయన వద్ద శిష్యత్వమునకై ప్రార్థించి స్వీకరించిరి. ఆ రకంగా కందాడై వంశము మణవాళ మహాముడుల నాశ్రయించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కోయిల్ కందాడై అన్నన్ పెరియ జీయర్ సన్నిధిని చేరుటకు తన శిష్యులయిన తిరువాఝి ఆళ్వార్, పెరియ జీయర్ శిష్యులయిన శుద్ధ సత్త్వమ్ అన్నన్ యొక్క సహాయము కోరేరు. శుద్ధ సత్త్వమ్ అన్నన్ పెరియ జీయర్ గొప్పదనమును అప్పుడప్పుడు కందాడై అన్నన్ కు చెప్పుచుండెడివారట. కోయిల్ కందాడై అన్నన్ తో బాటు వారి కుటుంబ సభ్యులు కూడా పెరియ జీయర్ మఠమునకు వారిని ఆశ్రయించుటకు ఫల, పుష్పాదులతో వచ్చి నప్పుడు పెరియ జీయర్ తమ శిష్యులకు తిరుమలై ఆళ్వార్ వైభవము గురించి వివరిస్తున్నారట. అన్నన్ తాను ఆ సమయమున లోపలకు పోవడం సరి కాదని ఆచ్చి అమ్మ కు తమ విషయము తెలిపి పెరియ జీయర్ కు విన్నవించమన్నారట. ఆచ్చి అమ్మ లోపలకు పోయి అచ్చట నున్న ఒక శ్రీవైష్ణవునితో అన్నన్, ఆయనతో బాటు వాధూల కుటుంబము పెరియ జీయర్ స్వామి దర్శనము కొఱకు వచ్చినట్లు ఆ విషయము పెరియ జీయర్ కు విన్నవించమనియు చెప్పిరి. ఆ శ్రీ వైష్ణవునకు ఈ వాధూల కుటుంబము పెరియ జీయర్ ను చూడడానికి ఎందుకు వచ్చేరో అర్థము కాలేదు. వాధూల కుటుంబము ముదలి ఆండాన్ వంశమైన గొప్ప ఆచార్య కుటుంబము. వారు పెరియ జీయర్ వద్దకు ఏదో ఒక విషయమై వాదనకై వచ్చి యుందురని తలచి ఆ విధంగానే పెరియ జీయర్ కు విన్న వించేరు. ఇంతలో కందాడై అన్నన్ అచటనే ఉన్న వానమామలై జీయర్ కు తమ రాకకు కారణము వివరించేరు. ఆచ్చి అమ్మ కూడ జరిగిన అపార్థము తెలుసుకొని తానే స్వయముగా పెరియ జీయర్ కు కందాడై అన్నన్ రాకకు కారణము తెలిపేరు. పెరియ జీయర్ కందాడై అన్నన్ ను ఆయన కుటుంబ పరివారమును ఆదరముగా ఆహ్వానించేరు. అన్నన్ ఫల, పుష్పాదులు సమర్పించి తాము వచ్చిన కారణము పెరియ జీయర్ కు నివేదించేరు. పెరియ జీయర్ తిరుప్పల్లాండు

గురించి, తిరువాయ్ మొళి యందలి పొలిగ, పొలిగ అను దశకము గురించి ఉపన్యసించి అన్నన్ ను ఆయన కుటుంబ వర్గాలను ఆదరించేరు. తరువాత అన్నన్ ను పొన్నడిక్కాల్ జీయర్ తో కబురంపి పిలిపించి, లోపలకు కొనిపోయి "మీరు ముదలి ఆండాన్ వంశ జన్ములు, ప్రసిద్ధమైన ఆచార్య కుటుంబం వారు, మీరేల మా దగ్గర శిష్యత్వము కోరుతున్నారు " అని ప్రశ్నించేరట. అన్నన్ అంతట తన దివ్య స్వప్న వృత్తాంతము వివరించి తనను క్షమించి స్వీకరించమని ప్రార్థించిరట. అంతట పెరియ జీయర్ మఱి మూడు దినములలో మఱి కొంతమంది అదృష్టవంతులు భగవానుని పనుపున శిష్యత్వమునకై రాబోవు చున్నారని ఆ రోజు అందరకును పంచ సంస్కారము చేయగలనని చెప్పిరట. అటులనే శ్రీ రంగనాథుడు మఱి కొంతమంది భక్తులకు అర్చకముఖముగా మణవాళ మహాముని గొప్పదనము వివరించి వారిని ఆశ్రయింపుడని పలికెను. ఆ ప్రకారంగా వారందరికీ నాటికి మూడవనాడు పెరియ జీయర్ పంచసంస్కారములు నిర్వహించి తన శిష్యులుగా స్వీకరించిరి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కందాడై అన్నన్ తరువాత ఎఱుంబి అప్పా కూడా పెరియ జీయర్ ను ప్రార్థించి తాను కూడా ఆయన వద్ద శిష్యత్వము పొందుతారు. కందాడై అన్నన్ కుమారుడు నాయన్ చాల తెలివిగల పిల్లడు. పెరియ జీయర్ పాశురములు చెప్పుచుండగా వాటికి వ్యాఖ్యానము నాయన్ చెప్పెడువారట. దానికి చాలా ఆనందించిన పెరియ జీయర్ నాయన్ ను ముద్దాడి తన తొడపై కూర్చుండ పెట్టు కొనే వారట. మన సంప్రదాయానికి ముందు ముందు నేతృత్వము వహిస్తావని చెప్పుచుండెడి వారట. పెరియ తిరుముడి అర్థవివరములు రచించిరి.

కందాడై అప్పన్ కు పంచ సంస్కారము పెరియ జీయర్ చేసినను అన్నన్ కు ద్రావిడ ప్రబంధమును అప్పన్ కు కటాక్షించమని చెప్పిరి. ఆ రకంగా అప్పన్ కు అన్నన్ ఆచార్యులైనారు. అప్పన్ వంశీయులు జీయర్ తిరువడి గళే శరణమ్, అనియు అన్నన్ తిరువడిగళే శరణమ్ అనియు కూడ అందురు.

పెరియ జీయర్ ఆదేశమున కందాడై నాయన్ పెరియ జీయర్ పూర్వాశ్రమమునందు మనుమడైన జీయర్ నాయనార్ ఈడు వ్యాఖ్యానమునకు సంస్కృతమునందు అరుంబదము రచించిరి. శ్రీరంగ నాథుడు చిన్న పిల్లవాని రూపమున వచ్చి ( పెరియజీయర్ భగవద్విషయ కాలక్షేపము రంగనాథుని కోవెలలో అను గ్రహించుచుండగా ) "శ్రీశైలేశ దయాపాత్రమ్ " అను పెరియ జీయర్ తనియన్ అనగ్రహించిరి కదా. అదే విధముగా కందాడై అన్నన్ నివాసమునకు ఒక పిల్లవాడు వచ్చి ఆయనకు చిన్న చీటి ఇచ్చి

అదృశ్యమైరట. ఆ చీటి చూడగా దానిలో" శ్రీశైలేశ దయాపాత్రమ్..." అను పెరియ జీయర్ తనియన్ ఉన్నదట. ఆ చిన్న పిల్లవాడు ఆ రంగనాథుడే అని అందరూ గ్రహించిరట.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అన్నన్ కు కావేరి ని శ్రీరంగము వదలి వెళ్ళని వారిగా ఆ రోజులలో అందరూ అనుకొనే వారట.(కావేరీ కడవాద కందాడై అన్నన్ రో). ఆయనకు శ్రీరంగముపై శ్రీరంగనిపై మక్కువ అంత గొప్పది. అందుకే కదా శ్రీమత్ కోయిల్ కందాడై (శ్రీమత్ కోయిల్ అంటే శ్రీరంగము) అని వారి ఇంటి పేరు. ఒకసారి పెరియ జీయర్ వారిని శ్రీ రంగనాథుడు తిరుమలపై నిత్యసూరులచే సంసేవ్యుడై ఉంటాడని అందుచే తిరువేంగడ ముడయాన్ ను సేవించి మంగళాశాసనములు చేసి రమ్మని చెప్పిరట. పెరియ పెరుమాళ్ ను సేవించి, వారి అనుజ్ఞ తీసికొని అటులనే ఆనందముతో అన్నన్ తిరుమల యాత్రకై బయలుదేరిరి. వారితో ఉత్తమ నంబి మొదలైన అనేకమంది శ్రీవైష్ణవులు కూడ తిరుమలకు పయనమైరి. అన్నన్ ను వారి శిష్యులు పల్లకిలో తీసుకొని వెళ్ళెదమనినలఅన్నన్ అట్లు కాదని కాలినడకనే తిరుపతి చేరిరి. అనంతాళ్వాన్ సంతతి వారైన అనంతాళ్వాన్ వారికి ఎదురేగి సాదరముగా తోడ్కొని పోయి తిరువేంగడ ముడయాన్ సేవ సాయించిరి. అచ్చట బదరికాశ్రమమున వేంచేసియున్న అయోధ్య రామానుజ అయ్యంగార్ స్వామి పెరియ జీయర్ వద్ద శిష్యత్వమునకై ఆకాంక్ష కలిగి యుండిరి. అనంతాళ్వాన్ అన్నన్ వద్ద శిష్యత్వము పొందిన పెరియ జీయర్ ఇంకా ఎక్కువ సంతోషము కలుగును అని పలుకుటచే వారు ఆనందముగా అన్నన్ వద్దనే శిష్యత్వమునకై ప్రార్థించి ఆయనవద్దనే చేరేరు. ఆనాటినుండి ఆయన కందాడై రామానుజ అయ్యంగార్ అని పిలువబడేవారు. వారు తరువాత కాలములో చాలా ప్రసిద్ధులై మన సంప్రదాయానికి ఎనలేని సేవ చేసేరు.

ఇటులనే శుద్ధ సత్త్వమ్ అన్నన్ కూడ కందాడై అన్నన్ శిష్యులై సత్సంప్రదాయానికి చాలా సేవ చేసేరు.

అన్నన్ కాంచీ పురానికీ, ఆ ప్రాంతాలలో ఉన్న దివ్య స్థలాలకీ వెళ్ళి అక్కడ పెరుమాళ్ళ సేవ చేసికున్నారు. ఒక్కడికి వెళ్ళినా ఆయన పాండిత్య వైభవాలకు అందరూ భరతం పట్టిన వారే.

అన్నన్ పేరు ఎంత వ్యాపించిందంటే పెరియ జీయర్ ను అన్నన్ జీయర్ అని పిలిచెడు వారట.

అటుపిమ్మట పెరియ జీయర్ పిలువగా మళ్ళీ శ్రీరంగము చేరేరు శ్రీ అన్నన్. వారిని ఆహ్వానించడానికి జైత్ర యాత్ర చేసి తిరిగి వచ్చిన కుమారుని చూచుటకు ఎదురేగిన తండ్రి వలె రంగనాథుని శేషమాల, ప్రసాదములతో పెరియ జీయర్ ఎదురు వెళ్ళి సాదరముగా ఆహ్వానించిరట.

తన చరమ సమయమున కూడ పెరియ జీయర్ శరీర అస్వస్థతో ఆచార్య హృదయానికి వ్యాఖ్యానము వ్రాస్తూండడం చూసి అన్నన్ బాధ పడి "ఎందుకిలా శ్రమ పడుతున్నారు" అని అడిగితే "లేకపోతే తరువాత తరాలకి ఈ రహస్యాలు ఎలా అందుతాయి" అని అన్నారట పెరియ జీయర్. అన్నన్ కూడా అలాగే జీవితాంతమూ సంప్రదాయమునకు ఎంతో సేవ చేసేరు. కోయిల్ కందాడై అన్నన్ కు వారి కుటుంబాలకు వారి పూర్వ వైభవము మళ్ళీ చేకూర్చిన వారు పెరియ జీయరైతే పెరియ జీయర్ కు అన్ని విషయాలలోని అండ దండలైన వారు కందాడై అన్నన్, అప్పన్ లు.

పెరియ జీయర్ మన సంప్రదాయ పరిరక్షణకు, పరి పుష్టికి, వ్యాప్తికి ఏర్పాటు చేసిన అష్ట దిగ్గజాలలో కందాడై అణ్ణన్ ప్రసిద్ధులు. వారి రచనలలో శ్రీపరాంకుశ పంచవింశతి, వరవరముని అష్టకము, మామునిగళ్ కణ్ణినుణ్ శిరుత్తాంబు ముఖ్యమైనవి.

పెరియ జీయర్ తానే

" ఎక్కుణాత్తోర్ ఎక్కులాత్తోర్ ఎవ్వియల్వోర్ అయిదినుమ్

అక్కణాత్తే నమ్మిఱైవరావరే

మిక్కపుగఝ్ కారార్ పొఝిల్ కోయిల్ కందాడై అణ్ణనేన్నుమ్

పేఱాళానై అడైంద పేర్"

(అతి కారుణికులైన కోయిల్ కందాడై అణ్ణన్ వద్ద శరణు పొందితే వారు ఏ జాతి వారైనా, ఎంత నీచ గుణమున్న వారైనా, దుష్టులైనా వారు నాకు తక్షణము నాకు ఆచార్యులే).

మణవాళ మహామునుల చే ఇట్లు కీర్తింపబడిన కందాడై అణ్ణన్ వైభవము గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.

కోయిల్ కందాడై అణ్ణన్ తనియన్

"సకల వేదాంత సారార్థ పూర్ణాశయమ్

విపుల వాధూల గోత్రోద్భవానామ్ వరమ్

రుచిర జామాతృవయోగీంద్ర పాదాశ్రయమ్

వరద నారాయణమ్ మద్గురుమ్ సంశ్రయే"

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కోయిల్ కందాడై అణ్ణన్ సోదరులూ, శిష్యులూ అయిన అప్పన్ ఆంధ్ర దేశమున మన సంప్రదాయ వ్యాప్తికై ఎక్కువ కాలము గడిపేరు. వారి కుమారులు ప్రణతార్తి హరాచార్యులు. వారి కుమారుడు వరదాచార్యులు, వారి కుమారుడు శ్రీవేంకటేశ్వర్లు గారు. వీరికి ఇద్దరు కుమారులు. అందులో ఒకరు శారద దర్పణ వరదాచార్యులు గారు. వీరి కుటుంబాలు దక్షిణ దేశము లోనే స్థిరపడి పోయినాయి. మఱియొక కుమారుడు రంగాచార్యులు గారు. మన ప్రాంతము లోనువ్న కోయిల్ కందాడై కుటుంబాలకు మూలపురుషులీయనే. వీరు ముదలి ఆండాన్ కు 12 వ తరము వారు. వారి వంశములో జన్మించిన శ్రీమత్ కోయిల్ కందాడై వేంకట రామాచార్యులు గారు శ్రీమాన్ ముదలి ఆండాన్ కు 24 వ తరము. కోయిల్ కందాడై అణ్ణన్, అప్పన్ లకు 16 వ తరము. శ్రీమత్ కోయిల్ కందాడై వేంకట రామాచార్యులు గారు సంపూర్ణ స్వయంకృషితో ద్రావిడ, సంస్కృత భాషలలో ఉద్దండ పాండిత్యము సంపాదించిన మహోన్నతులు. వ్యాకరణ శిరోమణి. ఆయన శ్రీమాన్ రాఘవార్య స్వామి వారి వద్ద పంచ సంస్కారములు పొంది, మందస రామానుజ స్వామి వారి (మందస రామానుజస్వామివారు శ్రీపెరుంబూదూరు కుండలి స్వామి వారి శిష్యులు) వద్ద శ్రీ భాష్యమును, రామతీర్థము రామానుజాచార్య స్వామి వద్ద భగవద్విషయమును సేవించేరు. చదువు అంటే ఎనలేని ప్రీతి వలన తాను కట్టించుకొనిన ఇంటికి వాణీ సద్మ అని పేరుంచుకొని ఎంతమందికో తన ఇంటిలో విద్యనభ్యసించుటకు తోడ్పడ్డారు. ప్రతివాది భయంకర అణ్ణంగరా చార్యస్వామి వారికి వేంకట రామాచార్యులు వారనిన గొప్ప గౌరవము ఉండెడిదట. వారిరువురు పెక్కు పండిత సభలలో పాల్గొనెడివారు. మన సంప్రదాయమునకు గొప్ప సేవ చేసి శ్రీభాష్య, భగవద్విషయ గోష్ఠులను, కాలక్షేపములను నిర్వహించు చుండెడివారు.

మన కుటుంబాలకు ఆయన ప్రాతః స్మరణీయులు.

వారి తనియన్

వాధూలాన్వయ భాష్యకార తనయమ్ శ్రీరాఘువార్యాశ్రితమ్

శ్రీరామానుజ దేశికద్వయ కృపా లబ్ధాగమాంతద్వయమ్

న్యాయే వ్యాకరణేష్వలంకృతిలయే వేదాంతయుగ్మే సమమ్

శ్రీమద్వేంకట రామదేశికమహమ్ విద్వాంసమార్యమ్ భజే

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =